www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

FLASH INDIA NEWS

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

| సంపుటి : 17 | సంచిక :72 | గురువారం 16.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/- |
|---|---|---|---|---|---|

విలేకరులు కావలెను

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారిగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

# డీలిమిటేషన్ పై కీలక చర్చ

## వారంలో పీఏసీ సమావేశం

- సీఎం రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ నేతల కీలక సమావేశం
- డీలిమిటేషన్, నామినేటెడ్ పదవులు, పార్టీ వ్యవహారాలపై చర్చ
- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగే అవకాశం చర్చ
- తెలంగాణకు అన్యాయం జరగకుండా పార్టీగా పోరాట ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచన
- 'హైబ్రిడ్ మోడల్' పై కూడా చర్చ
- పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ వేగవంతం చేయాలని నిర్ణయం
- కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- వారంలో పీఏసీ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం
- కేబినెట్ విస్తరణ, కమిటీల నియామకంపై త్వరలో నిర్ణయం

02



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం ఉదయం సమావేశమయ్యారు. మధ్యాహ్నం వరకూ ఈ భేటీ కొనసాగగా.. ప్రధానంగా నామినేటెడ్ పదవుల భర్తీ, నియోజకవర్గాల పునర్విభజన , పార్టీ అంతర్గత వ్యవహారాలపై కీలకంగా చర్చించినట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం కలిగే అవకాశం ఉ ందన్న అంశంపై ప్రధానంగా చర్చించారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లను పెంచితే, అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణకు అన్యాయం జరుగుతుందని, దీనిపై పార్టీ పరంగా చేపట్టాల్సిన పోరాటాలు, ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు సమాచారం. అలాగే.. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా ఉండేందుకు సీఎం ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' పై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

**నామినేటెడ్ పదవుల భర్తీ**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇర–ంవురు నేతలు నిర్ణయించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు, ఎన్నికల సమయంలో చురుగ్గా పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని మీనాక్షి నటరాజన్ కోరారు. ఇప్పటికే పదవుల్లో ఉన్న కార్పొరేషన్ ఛైర్మన్ల పనితీరును బేరీజు వేసి, వారి పదవీకాలం పొడిగింపు లేదా కొత్త వారి నియామకంపై ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చారు.

**వారంలో పీఏసీ సమావేశం**

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ

## డీలిమిటేషన్‌కు వ్యతిరేకం, మహిళా బిల్లుకు మద్దతు

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటన

- డీలిమిటేషన్ బిల్లుకు ఇండియా కూటమి వ్యతిరేకం
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటన
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల వ్యూహంపై చర్చ
- బిల్లులపై కూటమి భిన్న వైఖరి
- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం అన్న ఆరోపణ
- పార్లమెంట్‌లో రగడ జరిగే అవకాశం

02





## ప్రముఖ పర్యాటక కేంద్రంగా పులిగుండాల

### పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: డిప్యూటీ సీఎం

- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం
- కాటేజీల నిర్మాణానికి ₹4కోట్లు మంజూరు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఎకో టూరిజానికి ప్రాధాన్యం : మంత్రి పొంగులేటి

03

### మనిషి జీవితం చెట్లపై ఆధారపడి ఉంది...

### సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణం..

పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట గ్రామంలోని పులిగుండాల ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి

## కరీంనగర్‌లో పొలిటికల్ హీట్

### ఒకే రోజు రేవంత్, కేసీఆర్ టూర్

- కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిశీలించనున్న రేవంత్
- జగిత్యాలలో జీవన్రెడ్డి సభకు హాజరుకానున్న కేసీఆర్
- ప్రజాసభలో కీలక సందేశం ఇవ్వనున్న ముఖ్యమంత్రి
- రెండున్నరేళ్ల తర్వాత ప్రజల్లోకి గులాబీ దళపతి
- ప్రముఖ నేతల పర్యటనలతో మరింత ఆసక్తి

03



తెలంగాణ రాజకీయాలు మరోసారి కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్నాయి. ఈ నెల 20న ఒకే రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరంలో పర్యటిం చనున్న వేళ, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జగిత్యాలలో భారీ బహిరంగ సభకు హాజరవ్వడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## దంచికొడుతున్న.. ఎండలు

### నిప్పుల కొలిమిలా తెలంగాణ

ఏకంగా 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

వచ్చే మూడో రోజులు మరింత పెరిగే అవకాశం

పగటి పూట బయటకు రావద్దంటున్న డాక్టర్లు

సాధారణం కంటే పెరిగిన ఉష్ణోగ్రతలు

02



## భారీగా ఆర్థిక లావాదేవీలు!

### కేదార్‌కు సుమారు ₹25 లక్షలు బదిలీ

కేదార్ ఫోన్ డేటా, డిజిటల్ ఆధారాలు కీలకం

- మొయినాబాద్ డ్రగ్స్ కేసులో రోజుకో కొత్త విషయాలు బయటపడుతున్నాయి
- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కీలక నిందితుడిగా ఉన్నాడు
- దుబాయ్‌లో మరణించిన కేదార్‌తో రోహిత్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు

02

## టీసీఎస్‌లో "కార్పొరేట్ లవ్ జిహాద్"..

### ప్రేమ పేరుతో మోసం చేసి మత మార్పిడికి ప్రేరేపణ

పోలీసులు అండర్ కవర్ ఆపరేషన్ చేసి నిజాలు బయటపెట్టారు

- పోలీసులు అండర్‌కవర్ ఆపరేషన్ చేసి నిజాలు బయటపెట్టారు
- హౌస్‌కీపింగ్ స్టాఫ్‌గా వేషం వేసి 2 వారాలు గమనించారు
- మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపులు, మత మార్పిడి ఒత్తిడి గుర్తించారు
- ప్రధానంగా 18–25 ఏళ్ల మధ్య తరగతి యువతులు టార్గెట్
- ప్రేమ పేరుతో మోసం చేసి మత మార్పిడికి ప్రేరేపణ
- విదేశీ మత ప్రచారకుడు ఇర్మాన్ (మలేషియా) వీడియో కాల్స్ ద్వారా సంప్రదింపులు

02




ఏఐ జనరేటెడ్ ఫోటో



## మా వైఖరిలో ఎలాంటి మార్పు లేదు

### అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం

- దక్షిణాదిలో తీవ్ర ఉద్యమం తప్పదు
- హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదు
- అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాలి
- పార్లమెంట్లో ప్రాతినిధ్యాన్ని తగ్గించడం సమంజసం కాదు
- కేంద్రం ఆలోచన తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
- ఎక్స్లో స్పష్టం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

05



## వికారాబాద్‌లో హోరెత్తిన ఆందోళన..

### భూసేకరణ ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం

### బలవంతపు భూసేకరణపై అధికారులపై చర్యలు కోరారు

- పరిగి ప్రాంతంలో భూసేకరణకు వ్యతిరేకంగా కవిత ఆందోళన
- రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుంటున్నారని ఆరోపణ
- వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట భారీ నిరసన
- సారవంతమైన సాగు భూములను పరిశ్రమల కోసం తీసుకోవడంపై వ్యతిరేకత

03

## సీఎం ప్రపోజల్ ప్రపంచంలో ఎక్కడా లేదు

### 'హైబ్రిడ్ మోడల్' అనేది ప్రపంచంలో ఎక్కడా లేదు



- డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం
- ఇది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ, రాజకీయంగా ఉపయోగించకూడదని విమర్శ
- 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ జరుగుతుందని స్పష్టం
- సీఎం వ్యాఖ్యలు అవగాహన లోపాన్ని చూపుతున్నాయని విమర్శ
- దక్షిణాది రాష్ట్రాల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టవద్దని హెచ్చరిక
- కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుంది
- సీఎం వాస్తవాలను వక్రీకరించవద్దని, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచన

03

# టీసీఎస్‌లో "కార్పోరేట్ లవ్ జిహాద్"..

**నాసిక్ :** నాసిక్ నగరంలోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS)లో జరిగిన "కార్పోరేట్ లవ్ జీహాద్" కేసు దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. లైంగిక వేధింపులు, మత మార్పిడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై కొంత మంది ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. సంస్థలో కీలక స్థాయిల్లో పని చేస్తున్న హెచ్‌ఆర్, మేనేజర్ సహా ఏడుగురికి అదుపులోకి తీసుకున్నారు. ఇక పోలీసులు వీళ్లను విచారిస్తున్నారు. పోలీసులు అండర్ కవర్ ఆపరేషన్ నిర్వహించగా, భయంకరమైన నిజాలు బయటపడ్డాయి. ఈ మొత్తం వ్యవహారం ఫిబ్రవరి నెలలో ఒక రాజకీయ పార్టీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదుతో మొదలైంది. టీసీఎస్‌లో పనిచేస్తున్న ఒక హిందూ యువతి రంజాన్ ఉపవాసాలు పాటిస్తోందని, ఆమె ప్రవర్తనలో మార్పులు వచ్చాయని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. తొలుత నాసిక్ పోలీసులు గోప్యంగా ఓ ఆపరేషన్‌ను చేపట్టారు. ఇందులో భాగంగా నలుగురు పోలీసులు హౌస్ కీపింగ్ సిబ్బంది వేషధారణలో ఆఫీసులోకి వెళ్లారు. అక్కడ జరుగుతున్న పరిణామాలను రెండు వారాల పాటు నిశితంగా గమనించారు. ఈ విచారణలో షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. అక్కడ పనిచేస్తున్న కొందరు టీమ్ లీడర్లు, సీనియర్ ఉద్యోగులు మహిళా ఉద్యోగినులను లైంగికంగా వేధించడం గమనించారు. అంతేకాదు.. వారిని మత మార్పిడికి ప్రేరేపిస్తున్నట్లు తేటతెల్లమైంది. ఈ లవ్ జీహాదీ ముఠా ముఖ్యంగా 18-25 ఏళ్ల మధ్య తరగతి యువతులనే టార్గెట్ చేస్తున్నట్లు తేలింది. బాధితుల శాలరీలు సైతం రూ.18-25 వేల మధ్యే ఉన్నాయి. పోలీసుల దర్యాప్తులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మలేషియాకు చెందిన ఇర్మాన్ అనే మత ప్రచారకుడి పేరు బయకు వచ్చింది. ఇర్మాన్ వీడియో కాల్స్ ద్వారా బాధితులతో పరిచయం పెంచుకున్నాడు. వాట్సాప్ చాట్స్ ద్వారా ఇందుకు సంబంధించిన ఆధారాలు లభించాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు డానిష్ షేక్. తనకు ఇంతకు ముందే వివాహం జరిగింది. తనకు పెళ్లయిందనే విషయాన్ని దాచిపెట్టి ఒక యువతిని ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. ఆపై ఆమెను ఇస్లాం వైపు మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ యువతిని రంజాన్ ఉపవాసాలు ఉండేలా, నమాజ్ చేసేలా ఒత్తిడి తెచ్చారని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అంతేకాదు.. నిందితుడి భార్య స్వయంగా బాధితురాలికి ఫోన్ చేసి డానిష్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పడంతో ఈ బంధం బయటపడింది. దీనిపై నమోదైన మొదటి ఎఫ్ఐఆర్ తర్వాత.. ఒక్కొక్కరిగా మహిళా ఉద్యోగినులు ధైర్యంగా చేసి ముందుకు వచ్చారు. తమపై జరుగుతున్న వేధింపుల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు లైంగిక వేధింపులు, మత మార్పిడి ప్రయత్నాలు, మతపరమైన మనోభావాలను దెబ్బతీసినందుకు సంబంధించి మొత్తం 9 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. అసిఫ్ అన్సారీ, షఫీ షేక్, షారూఖ్ ఖురేషి, రజా మేమన్, తౌసిఫ్ అత్తార్, అశ్విన్ చైనానీ సహా మొత్తం ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, హెచ్‌ఆర్ మేనేజర్ నిదా ఖాన్ మాత్రం ప్రస్తుతం పరారీలో ఉండటంతో ఆమె కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ దారుణాలపై టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత బాధాకరమైన విషయమని వ్యాఖ్యానించారు. సంస్థలో ఇలాంటి వేధింపులకు ఏమాత్రం తావులేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని టీసీఎస్ స్పష్టం చేసింది. ఇప్పటికే నిందితులను సస్పెండ్ చేయడంతో పాటు, సంస్థ అంతర్గత విచారణ కోసం సీఓఓ ఆర్తి సుబ్రమణియన్ నేతృత్వంలో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. రాజకీయంగానూ ఈ అంశం తీవ్ర దుమారం రేపుతోంది. తెలంగాణ బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ దీనిని "కార్పొరేట్ జిహాద్" అని అభివర్ణించగా, మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ బాధితులకు ఉద్యోగాల ఆశ చూపి, వారిని ట్రాప్ చేసి బలవంతంగా గొడ్డు మాంసం తినిపించారని సంచలన ఆరోపణలు చేశారు.

# భారీగా ఆర్థిక లావాదేవీలు!

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో దుబాయ్ లింకులు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసు దర్యాప్తులో రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తోంది. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి, గత ఏడాది దుబాయ్‌లో మరణించిన కేదార్‌కు మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలను పోలీసులు బట్టబయలు చేశారు. డ్రగ్స్ పార్టీల నిర్వహణలో కీలక పాత్ర పోషించినట్లు భావిస్తున్న కేదార్‌కు, రోహిత్‌రెడ్డి, రితేష్‌ల బ్యాంక్ ఖాతాల నుంచి భారీగా నగదు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. సుమారు రూ. 25 లక్షల వరకు లావాదేవీలు జరిగినట్లు బ్యాంక్ స్టేట్‌మెంట్లతో సహా ఆధారాలు సేకరించారు. డ్రగ్ పార్టీ నిర్వాహకులకు కేదార్ ద్వారానే ఈ నిధులు అందినట్లు పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు.

**మౌనం వీడని నిందితులు**

పోలీసు కస్టడీలో ఉన్న రోహిత్‌రెడ్డి, రితేష్‌లను ఈ ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించగా, వారు పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ఈ డబ్బును ఎందుకు పంపారు? దేని కోసం కేదార్‌తో అంత పెద్ద మొత్తంలో డీల్ కుదిరింది? అన్న ప్రశ్నలకు వారు స్పష్టత ఇవ్వలేదని పోలీసులు చెప్తున్నారు. గత ఏడాది దుబాయ్‌లో డ్రగ్స్ ఓవర్ డోస్‌తోనే కేదార్ మృతి చెందిన నేపథ్యంలో.. ఈ కేసు మూలాలు అంతర్జాతీయ డ్రగ్ మాఫియాతో ఏమైనా ముడిపడి ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. కేదార్ మరణించినా, అతని ఫోన్ డేటా, ఇతర డిజిటల్ ఆధారాల ద్వారా రోహిత్‌రెడ్డితో జరిపిన సంభాషణలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే సేకరించిన బ్యాంక్ ట్రాన్సాక్షన్లు ఈ కేసులో కీలక సాక్ష్యాలుగా మారుతాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ డ్రగ్ నెట్‌వర్క్‌లో ఇంకెంతమంది ప్రముఖులు ఉన్నారనే అంశంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.

# డీలిమిటేషన్ పై కీలక చర్చ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం ఉదయం సమావేశమయ్యారు. మధ్యాహ్నం వరకూ ఈ భేటీ కొనసాగగా.. ప్రధానంగా నామినేటెడ్ పదవుల భర్తీ, నియోజకవర్గాల పునర్విభజన , పార్టీ అంతర్గత వ్యవహారాలపై కీలకంగా చర్చించినట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం కలిగే అవకాశం ఉందన్న అంశంపై ప్రధానంగా చర్చించారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లను పెంచితే, అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణకు అన్యాయం జరుగుతుందని, దీనిపై పార్టీ పరంగా చేపట్టాల్సిన పోరాటాలు, ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు సమాచారం. అలాగే.. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా ఉండేందుకు సీఎం ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' పై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

**నామినేటెడ్ పదవుల భర్తీ**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు, ఎన్నికల సమయంలో చురుగ్గా పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని మీనాక్షి నటరాజన్ కోరారు. ఇప్పటికే పదవుల్లో ఉన్న కార్పొరేషన్ ఛైర్మన్ల పనితీరును బేరీజు వేసి, వారి పదవీకాలం పొడిగింపు లేదా కొత్త వారి నియామకంపై ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చారు.

**వారంలో పీఏసీ సమావేశం**

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం, పార్టీ బలోపేతంపై చర్చించేందుకు వారంలోగా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో కేబినెట్ విస్తరణ, జిల్లా స్థాయి కమిటీల నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# ఖర్గే సీటుపైనే రేవంత్ కన్నేశాడు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన అంశంపై బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇవాళ హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీలిమిటేషన్ చట్టాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే చేసిందని, ఇప్పుడు ఆ పార్టీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. 1972లో కాంగ్రెస్ పార్టీ చేసిన డీలిమిటేషన్ వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక లోక్‌సభ సీటు తగ్గిందని మహేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉండాలని రాజ్యాంగమే చెబుతోందని, ఆనాడు కాంగ్రెస్ చేసిన పొరపాట్ల వల్లే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం కేవలం 24 శాతానికే పరిమితమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**మహిళా రిజర్వేషన్లపై క్లారిటీ..**

మహిళా రిజర్వేషన్ల అమలుపై స్పందిస్తూ.. ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యతో రిజర్వేషన్లు అమలు చేస్తే మహిళలకు కేవలం 170 సీట్లు మాత్రమే వస్తాయని, అదే సీట్లు పెంచిన తర్వాత అమలు చేస్తే ఆ సంఖ్య 270 దాటుతుందని ఆయన లెక్కలతో వివరించారు. మహిళలకు చట్టసభల్లో సరైన గౌరవం దక్కాలంటే సీట్ల పెంపు అనివార్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్న విధానాలపై మహేశ్వర్ రెడ్డి తీవ్ర స్థాయిలో సెటైర్లు వేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని 'హైబ్రిడ్ పాలసీని' రేవంత్ రెడ్డి కనిపెట్టారని, దీన్ని తాను 'గాంధీ డీలిమిటేషన్ ప్రాసెస్ ' అని పిలుస్తానని ఎద్దేవా చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం పెంపు విధానం గురించి రేవంత్ మాట్లాడుతుండటం హాస్యాస్పదమని పేర్కొన్నారు.

**ఖర్గే సీటుపై రేవంత్ కన్ను..**

రాజకీయంగా రేవంత్ రెడ్డి లక్ష్యాలపై మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టి ఇప్పుడు తెలంగాణపై కంటే మల్లికార్జున ఖర్గే సీటుపైనే ఎక్కువగా ఉందని విమర్శించారు. ఖర్గే తర్వాత ఎలాగైనా ఏఐసీసీ అధ్యక్ష పదవిని దక్కించుకోవాలనే ప్లాన్‌తోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వింతైన ప్రతిపాదనలు తెరపైకి తెస్తున్నారని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల హక్కుల కోసం బీజేపీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మహేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్' సీఎం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పార్లమెంట్ లో దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తోందని కానీ మహిళా బిల్లును డీలిమిటేషన్ తో ముడిపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఒక హైబ్రిడ్ ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయ వైఖరిలో స్థిరత్వం లేదని ఆయన ఉదయం కాంగ్రెస్ ప్రతినిధిగా, సాయంత్రం బీజేపీ నేతగా ఉంటారని ఆరోపించారు. హైబ్రిడ్ విధానం రేవంత్ రెడ్డి పాలనలో కూడా కనిపిస్తోందన్నారు. కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశపెడుతున్న బిల్లులో అస్పష్టత ఉందన్నారు.

**సీఎం హైబ్రిడ్ మోడల్:**

కాగా నియోజకవర్గాల సంఖ్యను కేవలం జనాభా ఆధారంగా పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా ఆయన హైబ్రిడ్ మోడల్ ను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. 50 శాతం సీట్లు జనాభా ప్రాతిపదికన కేటాయించాలని మరో 50 శాతం సీట్లు ఆయా రాష్ట్రాల ఆర్థిక అభివృద్ధి ఆధారంగా కేటాయించాలని సూచించారు. దీని వల్ల జనాభా నియంత్రణ పాటించి, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడిన దక్షిణాధి రాష్ట్రాలకూ న్యాయం జరుగుతుందని వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ స్పందించిన కేటీఆర్ రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై పై విధంగా సెటైర్ వేశారు.

# ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యం

## కల్లూరులో రూ.10.50 కోట్లతో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం



**కల్లూరు,ఫ్లాష్ ఇండియా :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలంలో పర్యటించారు. ముందుగా కల్లూరు మండలంలో నారాయణపురం గ్రామంలో 2 కోట్ల 75 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి, రూ.10 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్, వైద్య సేవలు, మౌళిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని అన్నారు.

**ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉంది..**

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిసర పలు గ్రామాలకు చెందిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదని తెలిపారు. 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, విద్యుత్, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, వైద్యాధికారులు, విద్యుత్ శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దంచికొడుతున్న.. ఎండలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఏప్రిల్ నెల మధ్యలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో జనం విలవిలలాడుతున్నారు. ఆకాశం నుంచి నిప్పులు కురుస్తు న్నాయా అన్నట్లుగా ఎండల తీవ్రత పెరుగుతోంది. మంగళవారం నాటి వాతావరణ నివేదికల ప్రకారం, రాష్ట్రంలోని దాదాపు 29జిల్లాల్లో ఉష్ణో గ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ ను దాటి నమోదు కావడం గమనార్హం." ఉదయం 8 గంటల నుంచే ఎండ వేడి మొదలవుతుండగా, మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు.

**అడవి దేవులపల్లిలో అత్యధికం..**

రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4డి గ్రీలు, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్, నిజామాబాద్ జిల్లా భీంగల్ లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో 43.2 డిగ్రీల మేర ఎండ తీవ్రత ఉంది. రాజధాని హైదరాబాద్లో సైతం సాధారణం కంటే 2.8 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రత పెరిగి, ప్రజలను ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

**సాధారణం కంటే పెరిగిన ఉష్ణోగ్రతలు**

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండలు చాలా ముందుగానే ముదిరాయి. దాదాపు అన్ని జిల్లాల్లోనూ సాధారణం కంటే 1.5 నుంచి 3.8 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో సాధారణం కంటే 3.8 డిగ్రీలు, ఆదిలాబాద్లో 3.2 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగడం ఆయా ప్రాంతాల్లో ఎండల తీవ్రతను తెలియజేస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ కనీస ఉష్ణోగ్రత 40.9 డిగ్రీల కంటే తక్కువ ఎక్కడా నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**వడగాడ్పుల హెచ్చరిక..**

ఈ మూడు రోజులు (బుధ, గురు, శుక్రవారాల్లో) రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. గరిష్ట ఉష్ణోగ్రతలు మరో 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.


# పార్లమెంట్ లో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలి



**హిమాయత్ నగర్,ఫ్లాష్ ఇండియా :** బీసీ బిల్లు కై ప్రతిపక్షాలు పార్లమెంట్ లో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు దక్కినప్పుడే.. మహిళ బిల్లులో బీసీ మహిళలకు రిజర్వేషన్లు లభిస్తాయని ఆయన అన్నారు. ప్రతిపక్షాలు బీసీ బిల్లుపై మాట్లాడకుండా బీసీ మహిళ సబ్ కోటాపై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల బీసీ బిల్లు పెట్టాలని ప్రధాని మోదీని కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని కృష్ణయ్య తెలిపారు. బీజేపీపై బీసీ వ్యతిరేక పార్టీ ముద్ర వేయాలని ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ ఓబీసీ ప్రధానితో పాటు ఉపరాష్ట్రపతి 27 మంది కేంద్ర మంత్రులను బీసీలకు అవకాశం కల్పించిందని కృష్ణయ్య పేర్కొన్నారు. ఇప్పటికైనా బీసీ బిల్లు కోసం అందరూ కలిసి రావాలని , అప్పుడే బీసీ మహిళలకు న్యాయం దక్కుతుందని కృష్ణయ్య స్పష్టం చేశారు. పార్లమెంట్ లో మహిళ బిల్లు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని ఎంపీ కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు రాజేందర్, నీల వెంకటేష్, అనంతయ్య, మోదీ రాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌కు వ్యతిరేకం, మహిళా బిల్లుకు మద్దతు

**ఢిల్లీ :** డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటించారు. బుధవారం సాయంత్రం ఖర్గే నివాసంలో ఇండియా కూటమి నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రేపటి నుంచి మూడు రోజుల పాటు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. రెండు గంటల పాటు నేతల మధ్య సమావేశం జరిగింది. అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కూటమి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కానీ డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తున్నట్లుగా వెల్లడించారు. "మేము మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదు. కానీ ప్రభుత్వం బిల్లులను తీసుకువస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇది రాజకీయ ప్రేరేపితం. మేము డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాలని



నిర్ణయించుకున్నాం." అని ఖర్గే అన్నారు. రేపటి నుంచి 3 రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై చర్చించనున్నారు. అయితే తాజాగా బిల్లులపై ఇండియా కూటమి భిన్న స్వరం వినిపించింది. దీంతో మరోసారి పార్లమెంట్ ఉభయ సభల్లో రగడ జరగడం ఖాయంగా అనిపిస్తోంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని.. ఉత్తరాది రాష్ట్రాలు మేలు పొందుతాయని దక్షిణాది రాష్ట్ర నాయకులు ఆరోపిస్తున్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే

**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని ఆ పార్టీ నేతలను ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదన చేస్తున్నారని వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ పేర్కొన్నారు.



# వికారాబాద్‌లో హోరెత్తిన ఆందోళన..

**వికారాబాద్,ఫ్లాష్ ఇండియా :** పరిగి ప్రాంతంలో పరిశ్రమల స్థాపన పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. బుధవారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆమె భారీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో అన్నదాతల పొట్ట కొడుతోందని మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలో సారవంతమైన సాగు భూములను పరిశ్రమల కోసం సేకరించడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. "తాతల కాలం నాటి భూములను నమ్ముకుని బతుకుతున్న రైతులను రోడ్డున పడేయడం అన్యాయం. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలి" అని ఆమె డిమాండ్ చేశారు.

**రైతులతో కలిసి బైఠాయింపు...**

ధర్నాలో భాగంగా వందలాది మంది రైతులతో కలిసి కవిత ఆర్డీవో కార్యాలయం ముందు రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భూసేకరణ ప్రక్రియను ఆపకపోతే ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరిగి ప్రాంతంలో ప్రతిపాదిత పరిశ్రమల కోసం సాగు భూముల సేకరణను నిలిపివేయాలి. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదు. బలవంతపు భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భారీ సంఖ్యలో రైతులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు. కవిత రాకతో వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

# ప్రముఖ పర్యాటక కేంద్రంగా పులిగుండాల

## పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: డిప్యూటీ సీఎం

**పెనుబల్లి/సత్తుపల్లి,ఫ్లాష్ ఇండియా :** పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట గ్రామంలోని పులిగుండాల ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్‌ను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా బోటింగ్, వాటర్ ఫాల్స్, జంగిల్ సఫారీలను ప్రారంభించారు.

**సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణం..**

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ అందమైన ప్రదేశాన్ని పరిచయం చేసిన స్థానిక ఎమ్మెల్యే, డి.ఎఫ్.ఓ. లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, తెలంగాణలోని ప్రకృతి సౌందర్యాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కనకగిరి హిల్స్ అభివృద్ధిని తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్ట్ నీటి పరిసర ప్రాంతాల్లో రెండు వైపులా కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు సిఎస్ఆర్ నిధుల నుండి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పనుల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి, ఎప్పుడు పూర్తవుతాయి అనే కాలపట్టికను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పర్యాటకులు ఈ ప్రాంతానికి సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు.

**అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామం...**

ఈ ప్రాంతంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కనకగిరి హిల్స్ వంటి అందమైన ప్రాంతాలను సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎకో టూరిజం కింద రాష్ట్రంలో టాప్ 3 గమ్యస్థానాలలో ఒకటిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన పూర్తి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించిందన్నారు. అలాగే ఈ ప్రాంతానికి వెళ్లే యాక్సెస్ రోడ్డు ను డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు.

**మనిషి జీవితం చెట్లపై ఆధారపడి ఉంది...**

గత ప్రభుత్వం ప్రారంభించి మిగిలిపోయిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను ప్రస్తుత ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు ఆ ప్రాజెక్ట్ నుండి ఈ ప్రాంతానికి నీటిని తీసుకువచ్చి నిరంతర నీటి సరఫరా కల్పించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి, సాధ్యమైతే ఈ పనులను పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ చెట్లు లేకుండా జీవనం సాధ్యం కాదని, మనిషి జీవితం చెట్లపై ఆధారపడి ఉందని తెలిపారు. మనకు అవసరమైన ఆక్సిజన్ చెట్ల నుంచే లభిస్తుందని, మనిషి అవసరాలకు ఉపయోగించే మంచం వంటి అనేక వస్తువులు కూడా చెట్ల నుంచే వస్తాయని తెలిపారు. అటవీ సంరక్షణకు ప్రభుత్వం, మంత్రులు ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు...**

కనకగిరి హిల్స్‌కు ఎకో టూరిజం కింద నిధులు, నీలాద్రి హిల్స్‌కు దేవాలయ పర్యాటక అభివృద్ధి కింద నిధులను డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంజూరు చేయడం జరిగిందన్నారు. మన చుట్టూ ఉన్న అందమైన ప్రకృతిని కాపాడేందుకు అధికారులు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, మన సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక కట్టడాల అభివృద్ధిపై ఫోకస్

**కార్వాన్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు బుధవారం గోల్కొండ జోన్ లోని సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియం ను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో మంత్రి జూపల్లి పర్యటించి, కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పరిశీలించి,వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. పురావస్తు శాఖ, జీ హెచ్ ఎం సి, హెచ్ ఎం డీ ఏ, కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ అటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌసే పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని జీ హెచ్ ఎం సి అధికారులు ఆదేశించారు. అనంతరం గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోన్యుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియంను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ( ఖాదీ) ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , టీజీటీడీసీ, క్యూక్యూఎస్డీఏ అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనుక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. తెలంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో పొలిటికల్ హీట్

**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాలు మరోసారి కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్నాయి. ఈ నెల 20న ఒకే రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం లో పర్యటించనున్న వేళ, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జగిత్యాలలో భారీ బహిరంగ సభకు హాజరవ్వడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎండల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో, రాజకీయ వాతావరణం కూడా వేడెక్కుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ఆయుధంగా మారగా, ఇప్పుడు అదే ప్రాజెక్ట్ పై సమీక్షకు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా రానున్నడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల 20న కాళేశ్వరం చేరుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి, మేడిగడ్డ బ్యారేజ్, కన్నెపల్లి పంప్ హౌస్ ను పరిశీలించనున్నారు. ప్రాజెక్ట్ పనితీరుపై అధికారులు ఇచ్చే నివేదికలను సమీక్షించి, భవిష్యత్ చర్యలపై దిశా నిర్దేశం చేయనున్నట్లు సమాచారం. అనంతరం నిర్వహించే ప్రజాస భలో కీలక ప్రకటనలు చేసే అవకాశముంది. అదే సమయంలో శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించ నున్న సీఎం, ప్రాజెక్ట్ పునరుద్దరణపై ప్రజలకు నమ్మకం కల్పించే ప్రయత్నం చేయనున్నట్లు తెలుస్తోంది.

**జగిత్యాలో కేసీఆర్ సభ..**

ఇదే రోజు జగిత్యాలలో మాజీ సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పెద్దగా ప్రజల్లోకి రాని ఆయన, ఇప్పుడు మళ్లీ సభల ద్వారా కార్యాచరణ ప్రారంభించనున్నడం రాజకీయంగా కీలకంగా మారింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డిని జగిత్యాలలో జరిగే బహిరంగసభలో గులాబీ కండువా కప్పి కేసీఆర్ కారు ఎక్కించనున్నారు. ఇది ఇలా ఉంటే ఒకే రోజున ఒకవైపు ప్రస్తుత సీఎం ప్రాజెక్ట్ పర్యటన, మరోవైపు మాజీ సీఎం సభ- ఈ రెండు కార్యక్రమాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయనున్నాయి. ప్రజల దృష్టి ఇప్పుడు ఈ రెండు కార్యక్ర మాలపైనే కేంద్రీకృతమై ఉంది. 20న జరిగే పరిణామాలు రాష్ట్ర రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



# దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోండి

**ఆంధ్రప్రదేశ్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల లేఖ రాశారు. లేఖలో డీలిమిటేషన్‌పై కీలకంగా ప్రస్తావించారు. "కేంద్రం ప్రతిపాదించిన 2011 జనాభా లెక్కల ఆధారిత డీలిమిటేషన్ ప్రక్రియ రాష్ట్ర ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీస్తోంది. ఇది ఆంధ్రప్రదేశ్ రాజకీయ, ఆర్థిక భవిష్యత్తుకు పెను ముప్పు. అత్యంత ఆందోళనతో, ఒక అత్యవసర పరిస్థితిగా గుర్తిస్తూ, నియోజకవర్గాల పునర్విభజనపై ఈ 3 పేజీల బహిరంగ లేఖను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన రాస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ తన స్వరం మాత్రమే కాదు, వేల కోట్ల రూపాయల భవిష్యత్ ఆర్థిక అవకాశాలను కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో, నేను మిమ్మల్ని గట్టిగా, స్పష్టంగా కోరుతున్నాను. దక్షిణ రాష్ట్రాలు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రంగా అన్యాయం చేసే ఈ ప్రతిపాదిత డీలిమిటేషన్‌కు మీరు బహిరంగంగా, స్పష్టంగా వ్యతిరేకత తెలియజేయాలి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 లోక్‌సభ సభ్యులు, 11 రాజ్యసభ సభ్యులు అందరినీ, పార్టీ భేదాలు లేకుండా ఏకతాటిపైకి తీసుకువచ్చి, పార్లమెంటులో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసేలా ప్రోత్సహించాలి. అత్యవసరంగా ఒకరోజు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఈ కీలక అంశంపై చర్చించి, ప్రతిపాదిత డీలిమిటేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను తిరస్కరించే తీర్మానం ఆమోదించి, కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా పంపించాలి. ఇది రాజకీయ నిర్ణయం మాత్రమే కారాదు. ఇది ప్రజల హక్కులను కాపాడే రాజ్యాంగ బాధ్యతగా, భావితరాల భవితను గుర్తుపెట్టుకుని వేసే అడుగు" అని షర్మిల లేఖలో పేర్కొన్నారు.

# బీజేపీ నేతలు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాజకీయ ఎత్తుగడలో భాగంగానే మహిళ బిల్లును నియోజకవర్గాల పునర్విభజనతో కలిపుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళ బిల్లును ఒకే సారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా స్పష్టంగా చెప్పారన్నారు. మహిళా బిల్లును తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఎన్డీఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే బాగుండేదని ఇవా సీఎల్పీ మీడియా సెంటర్ లో మాట్లాడిన ఆయన.. యూపీఏ హయాంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును రాజ్యసభ ఆమోదించిందని రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు.

**నష్టం జరగదని బీజేపీ వివరించాలి:**

2026 జనాభా లెక్కల ప్రకారం చేయకుండా ముందే ఎందుకు హడావుడి చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దక్షణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజనతో అన్యాయం జరగకుండా సీఎం హైబ్రిడ్ ఫార్ములా సూచించారని ఈ ఫార్ములా రాష్ట్రాల్లో సమస్యగా మారదన్నారు. ఈ మోడల్ ఫార్ములాపై ప్రధాని మోడీకి, దక్షిణాది రాష్ట్రాలకు కూడా సీఎం లేఖలు రాశారన్నారు. కాని బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిడ్డారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ ఏ మాత్రం స్పృహలేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. యాభై శాతం సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు ఎలా నష్టం జరుగుతుందో సీఎం లెక్కలతో సహా వివరించారన్నారు. ఎలా నష్టం జరగదో బీజేపీ నాయకులు ప్రజలకు వివరించాలన్నారు.

**కిషన్ రెడ్డి ఫస్ట్, బండి సంజయ్ సెకండ్:**

జరగుతున్న నష్టాన్ని వివరించడం మానేసి రాజకీయ విమర్శలు చేయడం దారుణం అన్నారు. చేతనైతే మద్దతు ఇవ్వాలి లేదా మౌనంగా ఉండాలని కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారు. బీజేపీ నాయకుల తీరు ఇలానే ఉంటుందని, ఇష్టానుసారంగా చేస్తుంటే మేం ఎందుకు మద్దతు ఇవ్వాలని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో సలహాలు, సూచనలు ఇవ్వడం కూడా తప్పా అని ప్రశ్నించారు. బీజేపీ నియంతృత్వంగా వ్యవహరిస్తోందని, దేశాన్ని రాజకీయంగా కబలించాలనే ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేపీలో తెలివి తక్కువ నాయకుల్లో కిషన్ రెడ్డి మొదటి వాడైతే, బండి సంజయ్ రెండో వాడని ఎద్దేవా చేశారు. మోడీ కోసం బీజేపీ నేతలు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు. వివక్ష వల్లనే గతంలో తెలంగాణ ఉద్యమం వచ్చిందని కేంద్రం తీరు వల్ల భవిష్యత్ లో మరో ఉద్యమం వచ్చే అవకాశం ఉందన్నారు.

**కేసీఆర్ నోరు విప్పడం లేదెందుకు?:**

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంటే బీఆర్ఎస్ పార్టీ ఎందుకు మాట్లాడటం లేదని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. గతంలో దేశ్ కీ నేతగా కేసీఆర్ చెప్పుకున్నాడు.. ఇప్పుడెందుకు నోరు విప్పడం లేదన్నారు. నరేంద్ర మోడీకి భయపడి మాట్లాడటం లేదా? లేదా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న భావన కలుగుతుందన్నారు. డీలిమిటేషన్ పై బీఆర్ఎస్ పార్టీ స్పష్టంమైన వైఖరి చెప్పాలన్నారు.

# సీఎం ప్రపోజల్ ప్రపంచంలో ఎక్కడా లేదు


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. బుధవారం వరంగల్‌లో పర్యటించిన ఆయన.. అక్కడ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా అమలయ్యే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను రాజకీయం చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. డీలిమిటేషన్ అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుందని స్పష్టంగా తెలిసినప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను అయోమయానికి గురిచేసేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి ప్రతిపాదిస్తున్న 'హైబ్రిడ్ మోడల్' అనేది ప్రపంచంలో ఎక్కడా లేని వింత అని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.



**ఇండియా కూటమి కుట్ర...**

డీలిమిటేషన్ పేరుతో ప్రజల్లో అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ఇండియా కూటమి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే తప్పుడు సాకుతో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టవద్దని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతి ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహిస్తుందని.. అనవసరపు విమర్శలు మానుకొని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని సీఎంకు సూచించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి వాస్తవాలను వక్రీకరించడం రేవంత్ రెడ్డికి తగదని, డీలిమిటేషన్‌పై అవగాహన పెంచుకోవాలని రాంచందర్ రావు సూచించారు.

# లోకేశ్‌కు అభినందనల వెల్లువ



**ఆంధ్రప్రదేశ్ :** టీడీపీ నూతన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నారా లోకేశ్‌కు మంత్రి అనగాని సత్యప్రసాద్ మనస్ఫూర్వక అభినందనలు తెలిపారు. నారా లోకేశ్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ఉరకలెత్తే యువ ఉత్సాహంతో మరింత ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. తాత ఎన్టీఆర్ ఆశయాలను, తండ్రి చంద్రబాబు విజనరీని పునికి పుచ్చుకున్న లోకేశ్ దేశంలోనే అత్యుత్తమ పార్టీగా టీడీపీని నడిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ల అనుభవాలు, యువకుల వేగం కలయికతో నారా లోకేశ్ నాయకత్వంలో టీడీపీ అజేయంగా సాగుతుందని మంత్రి అనగాని తెలిపారు. మండల, క్లస్టర్ స్థాయి నేతలను పొలిట్ బ్యూరోలోకి తీసుకున్న చరిత్ర టిడిపిది మాత్రమేనన్నారు. కొత్త కమిటీల్లో భారీ సంఖ్యలో బడుగు బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం చంద్రబాబు, లోకేశ్ చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## సంపాదకీయం

# రికార్డులు తిరగరాస్తున్న తెలంగాణ..

ఇప్పటి వరకు ఫార్మారంగ ఎగుమతులకు ప్రసిద్ధి చెందిన తెలంగాణ తాజాగా ఇంజినీరింగ్ ఎగుమతుల్లోనూ సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ ఇంపోర్టు-ఎక్స్‌పోర్టు రికార్డు ఫర్ ఇయర్లీ అనాలసిస్ ఆఫ్ ట్రేడ్(నిర్యత్) పోర్టల్లో పొందుపరిచిన గణాంకాల ప్రకారం 2023-24 నుంచి 2024-2025 మధ్య తెలంగాణ.. దేశంలో ఇంజినీరింగ్ ఎగుమతుల్లో అత్యధికంగా 117.9% వృద్ధిని నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచింది. విమాన విడిభాగాలు, రక్షణ రంగ పరికరాలు, పరిశ్రమ యంత్రాలు వంటి ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతుల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధి రేటుని నమోదు చేసింది. కేవలం రెండేళ్లలోనే ఇంజినీరింగ్ ఎగుమతులు నాలుగు రెట్లు పెరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**మిగతా రాష్ట్రాల సగటు వృద్ధి 10% మాత్రమే..**

2022--23లో 1,827 మిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు 2024--25 నాటికి 7,536 మిలియన్ డాలర్లకు చేరుతూ 103% వార్షిక సమ్మిళిత వృద్ధి రేటు(సీఏజీఆర్)ను నమోదు చేయడం చారిత్రాత్మకం. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల సగటు వృద్ధి కేవలం 10% మాత్రమే ఉండగా, తెలంగాణ రికార్డు నెలకొల్పే వృద్ధి నమోదు చేసుకోవడం గమనార్హం. రాష్ట్ర సరుకుల ఎగుమతుల్లో ఇంజినీరింగ్ వస్తువుల వాటా 38.44%కు చేరింది. ఇది తెలంగాణ ఎగుమతి రంగంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ మార్పును సూచిస్తోంది. కాగా, 2025--26తో పాటు రానున్న పది సంవత్సరాల్లో ఇదే రకమైన వృద్ధిని కనబరిచే అవకాశాలున్నాయని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.

**అంతర్జాతీయ కంపెనీల కేంద్రాల ఏర్పాటుతో..**

కాగా, ఈ వృద్ధికి గల ప్రధాన కారణం ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భారీ స్థాయిలో ఉత్పత్తులు పెరగడమేనని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్‌లో లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, ఎయిర్‌బస్, సఫ్రాన్, జీఈ ఏవియేషన్, ప్రాట్ ఢ విట్నీ, కాలిన్స్ ఏరోస్పేస్, హనీవెల్ వంటి అంతర్జాతీయ కంపెనీలు తమ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో, విడి విభాగాలు ఉత్పత్తి వల్ల తెలంగాణ రాష్ట్రం కీలక తయారీ కేంద్రంగా అవతరించింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరిన నాటి నుంచి గణనీయమైన పురోగతితో దేశంలో తెలంగాణ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలిచింది. 2023-24లో 8వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ఒక్క ఏడాదిలోనే 4వ అతిపెద్ద ఇంజినీరింగ్ ఎగుమతిదారుగా ముందుకు దూసుకెళ్లింది. ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధి కోసం భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి అడుగులు పడుతుండగా, పరిశ్రమల కోసం మరే రాష్ట్రంలో లేని విధంగా భారీగా భూములు కలిగి ఉండడంతో రానున్న కాలంలో తెలంగాణ మరింత దూకుడు ప్రదర్శించనుంది.

**తరలిరానున్న మరిన్ని తయారీ కంపెనీలు**

సేవా రంగాలకోసం క్యూర్, తయారీ రంగాలకు ప్యూర్, వ్యవసాయ ఆధారిత రంగాలకు రేర్‌లుగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ఆలోచన దీర్ఘకాలికంగా ఉపయోగపడనుంది. తయారీ రంగ కంపెనీలకు వ్యయ సామర్థ్యం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వేగంగా వృద్ధి చెందుతున్న తయారీ రంగం కలిగి ఉండడంతో రాష్ట్రానికి మరిన్ని తయారీ కంపెనీలు రానున్నాయి. ఈ వేగంతో మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ వంటి రాష్ట్రాలకు ఇప్పటికే ధీటుగా తెలంగాణ పోటీనిస్తోంది. రానున్న సంవత్సరాల్లో కూడా ఇంజినీరింగ్ ఎగుమతులు ఇదే రీతిలో పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# భద్రాద్రికి 'బంగారు' దశ..

దక్షిణ అయోధ్య భద్రాద్రి అభివృద్ధిని తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి జరగనుంది. భద్రాద్రి ఆలయాన్ని భక్త రామదాసు నిర్మించగా... అనంతరం అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. 58 ఏండ్లుగా తర్వాత మళ్లీ భద్రాద్రి రామాలయం ఉద్దరణకు నోచుకుంది. రూ.586 కోట్లతో మూడు దశలలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, మొదటి దశ పనులకు రూ.276 కోట్లు కేటాయించింది. మొదటి దశ పనులు 2027 శ్రీరామ నవమి నాటికి పూర్తి చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు ఈ నెల 26 నుంచి జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించనున్నారు.భక్త రామదాసు నిర్మించిన ప్రధాన ఆలయం మినహా, చుట్టూ ఉన్న అనుబంధ ఆలయాల స్థానంలో నూతనంగా రాతి కట్టడాలు నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణ సమయంలో ప్రధాన ఆలయంలో ఆర్జిత సేవలు నిలిపివేసి, మిథిలా స్టేడియంలో కళ్యాణ మండపం దగ్గర ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి ఆర్జిత సేవలు, నిత్య కల్యాణం అక్కడే నిర్వహించనున్నారు. రామయ్య దర్శనం యథావిధిగానే కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రామాలయంలో 15 ఉపాలయాలు, 75 మూర్తులు, 3 గాలి గోపురాలు ఉన్నాయి. కాగా రామాలయం అభివృద్ధి గురించి నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

**అప్పటి నుంచి.. ఇప్పటివరకు**

1956వ సంవత్సరములో ఆంధ్ర రాష్ట్రావతరణ జరిగింది. నైజాం ప్రభుత్వ పాలనలో ఉన్న భద్రాద్రి రామాలయం ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ పరిపాలనలోనికి వచ్చింది. అప్పటి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖా మంత్రి కల్లూరు చంద్రమౌళి అధ్యక్షులుగా చిట్టిగూడూరు సంస్కృత కళాశాల వ్యవస్థాపకులు శ్రీమాన్ మత్తిరుమల గుదిమెళ్ల వరదాచార్యుల వారు ఉపాధ్యక్షులుగా భద్రాచల రామాలయ ఉద్దరణ సంఘం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కూడా ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నారు.దేశం నలుమూలల నుంచి రూ.24లక్షల విరాళాలు వచ్చాయి. ఆ విరాళాలతో స్వామి వారికి అపురూప శిల్పకళా ఖండమైన కళ్యాణ మండపం నిర్మాణం జరిగింది. స్వామివారి గర్భాలయ పునర్నిర్మాణం జరిగింది. ఇదే సమయంలో తిరుపతి దేవస్థానం సత్రం, అన్నవరం సత్యనారాయణ స్వామి వారి సత్రం, ద్రాక్షారామ సత్రం, చంద్రమౌళి సదనం నిర్మితమయ్యాయి. నీలంరాజు వెంకటశేషయ్య ఆంధ్రప్రభ పత్రిక తరఫున సమర్పించిన రూ.2లక్షల విరాళంతో రామదాసు ధ్యాన మందిరం నిర్మించారు.1968వ సంవత్సరంలో భద్రాచల సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రప్రథమ ధర్మ కర్తృత్వ సంఘం ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి మొట్టమొదటి అధ్యక్షుడు నెమరుగొమ్ముల యతిరాజారావు, తర్వాత అల్లూరి మూర్తిరాజు అధ్యక్షతలో రెండవ ధర్మకర్తృత్వ సంఘం ఏర్పడింది. ఆ సంఘం చేసిన కృషితో కర్నూలు శ్రీనివాసరావు సత్రం, ఉత్తర వైకుంఠద్వారం, గోదావరి స్నానం చేసే యాత్రికుల సౌకర్యార్థం పశ్చిమ భాగంలో అందమైన సోపానపంక్తి, భూకంపంలో శిథిలమైన పర్ణశాల రామాలయ పునర్నిర్మాణం మరెన్నెన్నో నిర్మాణాలు జరిగాయి.ప్రఖ్యాత సినీ కళాకారుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమంతో ఆదాయం లభించింది. కల్యాణ మండపం దగ్గర డార్మెటరి టెరిటర్ హాలు, ఆంజనేయ స్వామివారి వద్ద ముఖమండపం, అగ్నిమాపక కార్యాలయం వద్ద స్వాగత ద్వారం, వాహనశాల, దుకాణాల సముదాయం, దక్షిణరాజ గోపురం నిర్మితమయ్యాయి. ఇలా భద్రాచల సీతారామ చంద్రస్వామి ఆలయం దిన దినాభివృద్ధి చెందింది. వాస్తు శాస్త్రానుగుణంగా ఆలయం అభివృద్ధి చేశారు. అనేక మార్పులు చేశారు. భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించారు. నూతన కట్టడాలు సత్రాలు వెలిశాయి. స్వామి దర్శనార్థం యాత్రికుల సంఖ్య పెరిగింది. స్వామి ఆదాయం కూడా గణనీయంగా వృద్ధి పొందింది.

# పెరగనున్న అసెంబ్లీ స్థానాలు..

డీలిమిటేషన్ ప్రక్రియతో రాష్ట్రంలో భారీగా అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు సీట్ల రిజర్వేషన్‌లతో రాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. అదే సమయంలో సీట్ల రిజర్వేషన్‌లు, భౌగోళిక సరిహద్దుల్లో మార్పులు జరగనున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్‌లు, మహిళా సీట్లను ఖరారు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న 17 లోక్‌సభ స్థానాలు 26కు పెరగనున్నాయి. ఒక్కో లోక్‌సభ సీటుకు 7 అసెంబ్లీ స్థానాల చొప్పున శాసనసభ స్థానాలు 182కి చేరనున్నాయి. వీటిలో మహిళలకు 60 సీట్లు రిజర్వ్ కానున్నాయి. రాష్ట్రంలో 3,50,40,000 జనాభా ఉందని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. మొత్తం 182 సీట్లలో ఒక్కో అసెంబ్లీ సీటుకు సగటున 1.92 లక్షల జనాభా ఉండేలా నియోజకవర్గాలను ఏర్పాటు చేయనున్నారు. దీనికి 10 శాతం ఎక్కువ లేదా 10 శాతం తక్కువ కానీ జనాభా ఉండేలా నియోజకవర్గాలను రూపొందించవచ్చు. ఈ నిబంధనను పునర్విభజన కమిషన్‌లో పొందుపర్చనున్నారు. గతంలోనూ ఈ రూల్ ఉంది. నియోజకవర్గాల పునర్విభజనను ఆదిలాబాద్ నుంచి ప్రారంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**రిజర్వేషన్ల వారీగా సీట్లు..**

రాష్ట్రంలో పెరిగే అసెంబ్లీ స్థానాలతో కలుపుకుని ఎస్సీలకు 28 సీట్లు, ఎస్టీలకు 16 అసెంబ్లీ సీట్లు రిజర్వ్‌కానున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో 3.50 కోట్ల జనాభా ఉండగా ఇందులో పురుషులు 1.76 కోట్లు, మహిళలు 1.73 కోట్లు ఉన్నారు. తెలంగాణలో ఎస్సీల జనాభా 54.09 లక్షలుగా ఉంది. దీంతో ఎస్సీలకు 15.45 శాతం సీట్లు రిజర్వ్‌చేయాల్సి ఉంటుంది. ఎస్టీల జనాభా 31.78 లక్షలుగా ఉండటంతో వారికి 9.08 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంది. మిగిలిన సీట్లు జనరల్ కేటగిరీగా పరిగణిస్తారు.ఈ లెక్కల ప్రకారం ఎస్సీలకు 28 సీట్లు, ఇందులో 9 సీట్లు ఎస్సీ మహిళలకు దక్కే అవకాశాలున్నాయి. మరోవైపు ఎస్టీలకు 16 సీట్లు కేటాయించే అవకాశాలున్నాయి. ఇందులో 5 సీట్లు మహిళలకు రిజర్వ్‌కానున్నాయి. 138 సీట్లు జనరల్ కేటగిరిలో ఉండనున్నాయి. ఇందులో మహిళలకు 46 సీట్లు రిజర్వ్‌కానున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా వీటిని 26కు పెరగనున్నాయి. ఇందులో 8 స్థానాలు మహిళలకు రిజర్వ్‌కానున్నాయి. ఇప్పటికే ఎస్సీలకు 3, ఎస్టీలకు 2 లోక్‌సభ స్థానాలు రిజర్వ్ కాగా వీరికి మరోకటి లేదా 2 సీట్లు వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా. ఇందులో మహిళా రిజర్వేషన్లు సైతం అమలు చేయనున్నారు.

**107 నుంచి 182 వరకు..**

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో 107 అసెంబ్లీ స్థానాలు ఉండేవి. 2008లో జరిగిన పునర్విభజనలో తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 119కి చేరాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. పునర్విభజన చట్టంలో తెలంగాణలో అసెంబ్లీ సీట్లను 153కు పెంచనున్నట్లుగా చట్టంలో పొందుపర్చారు. అయితే, పునర్విభజన చట్టాన్ని అమలు చేయలేదు. దీంతో 119 సీట్లే కొనసాగుతున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు 182 వరకు పెరగనున్నాయి.

**కమిటీలో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలు**

డీలిమిటేషన్‌కమిటీకి సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్, రాష్ట్రంలోని కేంద్రం ఎన్నికల సంఘం ప్రతినిధి, సెన్సెస్‌అధికారులు, సర్వే ఆఫ్ ఇండియా, ఇతర అధికారులు కమిటీలో ఉంటారు. వీరితో పాటుగా 10 మంది చట్టసభల ప్రజాప్రతినిధులు ఉంటారు. వీరిలో ఐదుగురు లోక్‌సభ సభ్యులు, ఐదుగురు శాసనసభ్యులు అసోసియేట్‌సభ్యులుగా ఉంటారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐదుగురు లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్ ఎంపిక చేస్తారు. ఐదుగురు ఎమ్మెల్యేలను శాసనసభ స్పీకర్ ఎంపిక చేస్తారు. ఈ 10 మంది డీలిమిటేషన్‌కమిటీ సమావేశాలకు హాజరై వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలుపొచ్చు.

**ప్రస్తావనకు రాని పెద్దల సభ**

కేంద్రం ప్రభుత్వం ప్రతిపాదించిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులో శాసనమండలి, రాజ్యసభలో సీట్ల పెంపు ప్రస్తావనను తీసుకురాలేదు. శాసనసభలో ఉండే సీట్ల సంఖ్యలో మూడో వంతు మండలిలో ఉంటాయి. ప్రస్తుతం మండలిలో 40 సీట్లు ఉండగా.. అవి 60కి పెరగాల్సి ఉన్నది. కేంద్రం మాత్రం ప్రస్తుత బిల్లుల్లో మండలి ప్రస్తావన తీసుకరాలేదని గుర్తు చేస్తున్నారు. దీనిపై రాజకీయ విశ్లేషకులు, నిపుణులు డీలిమిటేషన్ అమలయ్యాక కేంద్రం మరొక బిల్లులో రాజ్యసభ, మండలికి సంబంధించిన సీట్ల పెంపుపై ప్రత్యేక బిల్లులు తీసుకువస్తారని, అప్పుడు వాటి సీట్లు పెరుగుతాయని విశ్లేషిస్తున్నారు.

**పట్టణ ప్రాంతాల్లో పెరగనున్న సీట్లు..**

డీలిమిటేషన్‌లో భాగంగా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా పట్టణాలకు వలసలు పెరిగాయి. అవి జిల్లా కేంద్రాలకు, రాష్ట్ర రాజధానికి పెరుగుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో పెరిగే సీట్లు ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లోనే ఉండనున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌పరిసర ప్రాంతాల్లో ఎక్కువ సీట్లు పెరుగుతాయని ఒక అంచనాకు వచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌జిల్లాలో ప్రస్తుతం 25 సీట్లు ఉన్నాయి. వీటిలో అదనంగా మరో 15 సీట్ల వరకు పెరిగే అవకాశం ఉందని సమాచారం. వీటితో పాటుగా సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం, పటాన్ చెరు, సంగారెడ్డి, సదాశివపేట తదితర ప్రాంతాలతో మరో నాలుగైదు నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇలా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే 45 నుంచి 50 వరకు సీట్లు పెరిగే అవకాశం ఉంది.

**ఊపిరి పీల్చుకున్న గ్రామీణ తెలంగాణ..**

2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిర్ణయించడంతో గ్రామీణ తెలంగాణ ఊపిరి పీల్చుకుందనే చెప్పవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. 2011 తర్వాత గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు భారీగా వలసలు పెరిగాయి. 2011కు ముందు వలసలు ఉన్నా.. తక్కువగా ఉన్నాయని, ఆ తరువాత రాను రాను ప్రతిఏటా పట్టణీకరణ పెరిగింది. ఉపాధి, ఉద్యోగాల కోసం పట్టణాలకు ఎక్కువగా వలసలు వచ్చాయి. గత 15 ఏండ్లలో హైదరాబాద్ నగరంలో జనాభా పెరిగింది. దీంతో శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, కుత్బుల్లాపూర్, మేడ్చల్, రాజేంద్రనగర్, పటాన్‌చెరు, మహేశ్వరం, ఉప్పల్ లాంటి నియోజకవర్గాల్లో విపరీతమైన వలసలు పెరిగాయి. దీంతో ఆయా నియోజకవర్గాలతో ఒక్కొక్కటికి మూడు, నాలుగు నియోజకవర్గాలుగా మారే అవకాశం ఉండేదని, కానీ, 2011 జనాభా లెక్కలను తీసుకోవడంతో కొంత తక్కువగానే సీట్లు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

# గ్లోబల్ రీసెర్చ్ హబ్‌గా హైదరాబాద్

భారతీయ వైద్య పరిశోధన రంగం మరో మైలురాయిని అధిగమించింది. దేశీయంగా ఔషధ ఆవిష్కరణలు, వ్యాక్సిన్ల తయారీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) సంచలన నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ప్రపంచ స్థాయి వసతులతో ఉన్న నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రీసెర్చ్ (ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్) స్వరూపాన్ని పూర్తిగా మారుస్తూ, దానిని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్రీ-క్లినికల్ రీసెర్చ్ (ఎన్ఐపీసీఆర్) గా నామకరణం చేసింది. 2026 మార్చి 20 నుంచి ఈ నూతన వ్యవస్థ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించింది.

**దేశంలోనే ఫస్ట్**

గతంలో ఈ సంస్థ ప్రధానంగా పరిశోధనల కోసం ప్రయోగశాల జంతువులను (ల్యాబొరేటరీ యానిమల్స్) సరఫరా చేసే కేంద్రంగానే పరిగణించబడేది. అయితే మారిన కాలానికి అనుగుణంగా కేవలం సరఫరాకే పరిమితం కాకుండా... ఔషధాల తయారీలో అత్యంత కీలకమైన ప్రీ-క్లినికల్ దశకు దీనిని చిరునామాగా మార్చారు. అంటే.. ఏదైనా కొత్త మందు లేదా టీకాను మనుషులపై ప్రయోగించే (క్లినికల్ ట్రయల్స్) ముందు నిర్వహించే అత్యంత క్లిష్టమైన శాస్త్రీయ పరీక్షలు ఇకపై ఇక్కడ జరగనున్నాయి. ఇలాంటి ప్రత్యేక వ్యవస్థ ప్రభుత్వ రంగంలో ఏర్పాటు కావడం దేశంలోనే ఇది ప్రప్రథమం.

**ప్రీ-క్లినికల్ ప్రయోగాలు**

పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ ఎన్ఐపీసీఆర్ రెండు అత్యాధునిక మార్గాల్లో తన పరిశోధనలను ముందుకు తీసుకెళ్లనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన జంతువుల (అధునాతన యానిమల్ మోడల్స్)పై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి, ఔషధాల సామర్థ్యాన్ని లెక్కించనున్నారు. జంతువులపైనే కాకుండా, నేరుగా కణజాలాలు, కృత్రిమంగా సృష్టించిన సూక్ష్మ అవయవ నమూనాల (ఆర్గనాయిడ్స్)పై ప్రయోగాలు చేయనున్నారు. దీనివల్ల ఫలితాలు మరింత ఖచ్చితంగా రావడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతుంది.

**ప్రయోజనాలు**

ఈ సంస్థ ఏర్పాటుతో భారత వైద్య రంగానికి బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. గతంలో ప్రీ-క్లినికల్ ప్రయోగాల కోసం మన ఫార్మా కంపెనీలు, స్టార్టప్‌లు విదేశీ ల్యాబ్‌లపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్‌లోనే ఈ సదుపాయం అందుబాటులోకి రావడంతో ఖర్చు తగ్గడంతో పాటు భారీగా విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది.

ఒక ఔషధం మార్కెట్లోకి రావడానికి పట్టే సమయం గణనీయంగా తగ్గుతుంది. ముఖ్యంగా మహమ్మారుల సమయంలో టీకాల తయారీకి ఇది వెన్నెముకగా మారనుంది. ఫలితంగా వేగవంతమైన ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. విద్యా సంస్థలు, చిన్న స్థాయి అంకుర సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలను, నిపుణుల మార్గదర్శకత్వాన్ని ఎన్ఐపీసీఆర్ అందిస్తుంది. క్యాన్సర్, జన్యుపరమైన వ్యాధుల కోసం చేపట్టే సెల్ అండ్ జీన్ థెరపీ వంటి అత్యాధునిక చికిత్సల అభివృద్ధికి ఇది ఒక టెస్ట్ బెడ్ గా పనిచేయనుంది.

**అంతర్జాతీయ ప్రమాణాలు**

ఈ సంస్థ కేవలం పేరు మార్చుకోవడమే కాకుండా.. ఓఈసీడీ-జీఎల్పీ (గుడ్ ల్యాబొరేటరీ ప్రాక్టీస్) ప్రమాణాలను అనుసరిస్తుంది. అంటే హైదరాబాద్‌లోని ఈ ల్యాబ్‌లో జరిగిన పరిశోధన ఫలితాలను అమెరికాలోని ఎఫ్‌డీఏ లేదా యూరోపియన్ ఈఎంఏ వంటి అంతర్జాతీయ నియంత్రణ సంస్థలు నేరుగా ఆమోదిస్తాయి. దీనివల్ల మన దేశీ కంపెనీలు విదేశాల్లో మందులను విడుదల చేయడం చాలా సులభతరం అవుతుంది. గతంలో క్లిష్టమైన టాక్సికాలజీ (విష ప్రభావ పరీక్షలు) కోసం మనం చైనా లేదా యూరప్ దేశాల వైపు చూడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా మన శాస్త్రవేత్తలే ఇక్కడ పరీక్షలు నిర్వహిస్తారు. ఇది కేవలం వైద్య రంగం మాత్రమే కాదు, దేశ రక్షణకు (బయో డిఫెన్స్) సంబంధించిన టీకాల అభివృద్ధిలోనూ అత్యంత కీలకం కానుంది. జంతువులపై హింసను తగ్గించేందుకు ప్రపంచవ్యాప్తంగా అమలు చేస్తున్న 3ఆర్ఎస్ (రీప్లేస్ మెంట్, రిడక్షన్, రిఫైన్ మెంట్) సూత్రాన్ని ఈ సంస్థ పక్కాగా అమలు చేయబోతోంది. జంతువులకు బదులుగా ఆర్గన్-ఆన్-ఏ-చిప్ వంటి సాంకేతికతను వాడటం, తక్కువ జంతువులతో ఎక్కువ ఫలితాలు సాధించడం, ప్రయోగాల సమయంలో జంతువులకు నొప్పి తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవడమే 3ఆర్ఎస్ ఉద్దేశం.

**హైదరాబాద్ హబ్**

హైదరాబాద్ ఇప్పటికే వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్ గా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఐసీఎంఆర్ తీసుకున్న ఈ నిర్ణయంతో నగరం గ్లోబల్ రీసెర్చ్ హబ్ గా మరో మెట్టు ఎక్కింది. కేంద్ర ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్) పర్యవేక్షణలో పనిచేసే ఎన్ఐపీసీఆర్, ఇకపై అంతర్జాతీయ ఫార్మా దిగ్గజాలకు సైతం గమ్యస్థానంగా మారే అవకాశం ఉంది. ఇది తెలంగాణకు భారీగా విదేశీ పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించే అవకాశం ఉంది. మొత్తానికి ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్ రూపాంతరం కేవలం పేరు మార్పు మాత్రమే కాదు.. ఇది భారత ఆత్మనిర్భరతకు, ప్రపంచ ఆరోగ్య భద్రతకు వేసిన బలమైన పునాదిగా చెప్పొచ్చు.



# సీనియర్ అధికారి కౌంటర్ దమ్కీ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** నార్త్ ఇండియాకు చెందిన కార్పొరేట్ వ్యక్తితో పని నిమిత్తం డీల్ చేసుకున్న ఓ ఐఏఎస్ అధికారి దానిని పూర్తిచేయకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినందుకు బెదిరింపులకు దిగాడు. డబ్బులు అడిగితే కేసులు పెట్టించి జైలుకు పంపుతానని దమ్కీ ఇచ్చారు. దీంతో లబోదిబోమంటూ బాధిత కార్పొరేట్ వ్యక్తి తన సన్నిహితులకు విషయం చెప్పారు. వారంతా ఏకమై గుజరాత్ వ్యాపారుల లాబీని రంగంలోకి దింపే ప్రయత్నం చేశారు. విషయాన్ని గ్రహించిన సీనియర్ ఐఏఎస్ విషయం మరింత లాగితే అసలుకే ఎసరు వస్తుందని భావించి సగం డబ్బులు వెనక్కి ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై ప్రస్తుతం సెక్రెటేరియట్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

**రూ.10 కోట్లకు కుదిరిన డీల్?**

ప్రభుత్వంలోని కీలకమైన శాఖ బాధ్యతలు చూస్తున్న ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి లావాదేవీలను నేరుగా మాట్లాడకుండా ఓ మీడియేటర్‌ను నియమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ శాఖలోని వ్యవహారాలన్నింటినీ సదరు మధ్యవర్తి ద్వారానే సంబంధిత అధికారి క్లియర్ చేస్తారని ప్రచారం ఉంది. అందులో భాగంగా నార్త్ ఇండియాకు చెందిన ఓ కార్పొరేట్ పర్సన్‌కు చాలా కాలంగా సంబంధిత శాఖలో పెండింగ్‌లో ఉన్న పనిని క్లియర్ చేయించుకోవాలని భావించారు. అందుకోసం మధ్యవర్తి ద్వారా కీలక శాఖ బాధ్యతలు చూస్తోన్న సీనియర్ ఐఏఎస్ అఫీసర్‌ను కలిశారు. పని పూర్తి చేయడానికి రూ.10 కోట్లకు డీల్ మాట్లాడుకుని, అడ్వాన్‌గా రూ.కోటిన్నరకు పైగా నగదును తీసుకున్నట్లు తెలిసింది. కానీ, ఈలోపే ప్రభుత్వం ఆ సీనియర్ ఆఫీసర్‌ను ఆ శాఖ నుంచి బదిలీ చేయడంతో ఫైల్ క్లియర్ చేయలేకపోయారు. దీంతో పని కాలేదని, తాము ఇచ్చిన అడ్వాన్స్ వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు.

**కార్పొరేట్ వ్యక్తుల కౌంటర్ దమ్కీ..**

డబ్బులు వెనక్కి ఇవ్వాలని నిత్యం ఫోన్ చేస్తుండంతో సీనియర్ ఐఏఎస్ విసుగు చెంది డబ్బులు అడిగితే తనకు ఉన్న పరిచయాలతో పోలీసులకు చెప్పి కేసుల్లో ఇరికిస్తానని బెదిరించారు. దీనితో బాధితుడు తన బిజినెస్ సర్కిల్స్‌లోని వారికి అసలు విషయం వివరించి బోరున విలపించారు. దీంతో వారంతా ఏకమై గుజరాత్‌కు చెందిన బిజినెస్ లాబీని కలిసి సదరు ఐఏఎస్ అధికారి వ్యవహారాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. అనంతరం వారే ఏకంగా రంగంలోకి దిగి తీసుకున్న డబ్బులు ఇవ్వకపోతే తమ గుజరాత్ పవర్‌ను చూపిస్తామని సంకేతాలు పంపారని ప్రచారం జరుగుతున్నది. మ్యాటర్ చేయి దాటిపోతుందని గ్రహించిన సదరు అధికారి తీసుకున్న అడ్వాన్స్‌లో సగం డబ్బులు వెనక్కి ఇచ్చినట్లు ప్రచారం ఉంది.

**వివాదాల సెక్రెటరీ**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అధికారులకు ప్రయారిటీ ఇవ్వాలని భావించింది. అందులో భాగంగా సదరు సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్‌కు కీలకమైన శాఖ బాధ్యతలు అప్పగించారు. చార్జ్ తీసుకున్న కొత్తలో ఆయన పనితీరును చూసి అందరూ మెచ్చుకున్నారు. కానీ రోజులు గడుస్తున్న కొద్ది ఆయన అసలు స్వరూపం బహిర్గతం అవ్వడం మొదలైంది. తన ఆమోదం కోసం వచ్చే ఫైల్స్‌పై ఏదో ఒక కొర్రీ వేయడం, మంత్రుల సిఫారసులను వెనక్కి పంపడం పరిపాటిగా మారిందని విమర్శలు ఉన్నాయి. ఆయన వ్యవహార శైలి నచ్చక ఆ శాఖ మంత్రి సైతం పలుమార్లు అసహనానికి గురైనట్లు తెలుస్తున్నది. దీంతో ఆయన్ను కొన్ని రోజుల కిందట ఆ శాఖ నుంచి తప్పించారు.

# రైతు ముంగిట రాజకీయం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల కోసం ఆశావహులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. పదవీకాలం ముగిశాక కూడా ఏడాదిన్నరపాటు కొనసాగించిన ప్రభుత్వం గత నవంబర్‌లో పాలకవర్గాలను రద్దు చేసి పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. అయితే వారి ద్వారా రైతులకు సరైన సేవలు అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈసారి ప్రభుత్వం పీఏసీఎస్‌కు ఎన్నికలు నిర్వహించకుండా చైర్మన్లు, డైరెక్టర్లను నామినేటెడ్ పద్ధతిలో ఎంపిక చేయాలనే సమాలోచనలు చేస్తోంది. వ్యవసాయ శాఖ ఇప్పటికే నామినేటెడ్‌పద్ధతిలో నియమించాలని నిర్ణయానికి రాగా ముఖ్యమంత్రి ఆమోద ముద్ర కోసం వేచిచూస్తున్నారు. ఏడాది కిందటే దీనిపై ప్రచారం జరగడంతో అధికార పార్టీకి చెందిన పలువురు ఆశావహులు మంత్రుల చుట్టూ తిరిగి అవకాశం కల్పించాలని వేడుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చిన తరువాత అవకాశం కల్పిస్తామని వారికి మంత్రులు హామీ ఇచ్చారు. ఇప్పటివరకు సహకార సంఘాలకు ఎన్నికలా? నామినేటెడ్ పద్ధతిలో నియమిస్తారా? అనే చర్చ సంఘ సభ్యుల్లో సాగుతోంది. నామినేటెడ్‌విధానం తీసుకురావడంపై రైతు సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. పాత విధానంలో అమలు చేయాలని, పార్టీ కార్యకర్తల కోసం చేస్తే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నాయి.

**పర్సన్ ఇన్‌చార్జిలతో పాలనా వైఫల్యం..**

రాష్ట్రంలో 9 డీసీసీబీ బ్యాంకులతోపాటు 908 పీఏసీఎస్‌కేంద్రాలు రైతులకు సేవలందిస్తున్నాయి. వ్యవసాయ రుణాలు ఇవ్వటంతోపాటు ఎరువులు, విత్తనాల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్లలో కీలక పాత్ర వహిస్తున్నాయి. డీసీసీబీ నుంచి వ్యవసాయ భూములపై రుణాలు అందిస్తున్నాయి. యూరియా 80శాతం మేర సొసైటీల నుంచే రైతులకు అందుతోంది. ఏటా 5వేల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ఈ తరుణంలో పాలకవర్గాలను రద్దు చేసిన ప్రభుత్వం కోఆపరేటివ్ అధికారులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించటంతో రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి. సకాలంలో ఎరువులు అందటం లేదని, ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మరో 131 సంఘాలు..**

కొత్త మండలాల్లో 131 కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని సహకార శాఖ ప్రభుత్వానికి రెండు నెలల క్రితం సిఫార్సు చేసింది. ముఖ్యమంత్రి ఆమోదం లభించిన వెంటనే ఈ సంఘాలు కార్యరూపం దాల్చనున్నాయి. అయితే, వీటి విస్తరణలో తీవ్రమైన అసమానతలు నెలకొన్నాయి. కొన్నిచోట్ల రెండు గ్రామాలకు ఒక సంఘం ఉంటే మరికొన్నిచోట్ల 30 గ్రామాలకు కలిపి ఒకటే సంఘం ఉంది. సభ్యత్వ పరంగా ఒక సంఘంలో 500 మంది ఉంటే, మరికొన్నింటిలో 2,500 మంది రైతులు ఉన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత 81 మండలాల్లో ఒక్క సహకార సంఘం లేదు. ఈ వ్యత్యాసాలను గమనించిన ప్రభుత్వం, క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి 31 జిల్లాల నుంచి వచ్చిన 215 ప్రతిపాదనలను పరిశీలించి 131 మండలాలకు సహకార శాఖ జాబితా సిద్ధం

# ఇంజినీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ జోరు

- 117.9 శాతం వృద్ధిరేటుతో దేశంలోనే నంబర్ వన్
- రెండేళ్లలో నాలుగు రెట్లు పెరుగుదల
- ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల ఉత్పత్తుల్లో దూకుడు
- డీజీసీఐ అండ్ ఎస్ నివేదిక వెల్లడి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** ఇంజినీరింగ్ ఎగుమతుల్లో దేశంలోనే తెలంగాణ అత్యధిక వృద్ధిరేటును నమోదు చేసింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ ఇంపోర్ట్, -ఎక్స్‌పోర్ట్ రికార్డ్ ఫర్ ఇయర్లీ అనలిసిస్ ఆఫ్ ట్రేడ్ (నిర్యత్) పోర్టల్ విడుదల చేసిన తాజా గణాంకాల్లో ఈ విషయం స్పష్టమైంది. 2023-24 నుంచి 2024-25 మధ్య కాలంలో రాష్ట్రం 117.9 శాతం వృద్ధి రేటుతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రధానంగా విమాన విడిభాగాలు, రక్షణ రంగ పరికరాలు, పారిశ్రామిక యంత్రాల ఎగుమతులు వృద్ధికి కీలకంగా మారాయి. గత రెండేళ్ల కాలంలో రాష్ట్రం నుంచి జరిగిన ఇంజినీరింగ్ ఎగుమతులను పరిశీలిస్తే అవి ఏకంగా నాలుగు రెట్లకు పైగా పెరగడం విశేషం. 2022--23 ఆర్థిక సంవత్సరంలో 1,827 మిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, 2024-25 నాటికి 7,536 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ కాలంలో 103 శాతం వార్షిక సమ్మిళిత వృద్ధి రేటు (సీఏజీఆర్) నమోదైంది. ఇదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల సగటు వృద్ధి కేవలం 10 శాతం ఉండగా, తెలంగాణ దానికి మించి గణనీయమైన ముందంజ వేసింది. ప్రస్తుతం రాష్ట్రం నుంచి జరిగే మొత్తం వస్తువుల ఎగుమతుల్లో ఇంజినీరింగ్ ఉత్పత్తుల వాటా 38.44 శాతానికి చేరుకుంది. ఈ పురోగతిలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ (డీజీసీఐ అండ్ఎస్) నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**అంతర్జాతీయ సంస్థల కేంద్రాలు ఏర్పాటు**

హైదరాబాద్ వేదికగా లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, ఎయిర్‌బస్, సఫ్రాన్, జీఈ ఏవియేషన్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తమ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ కీలక గ్లోబల్ హబ్‌గా మారింది. దీంతో గతేడాది ఇంజినీరింగ్ ఎగుమతుల్లో 8వ స్థానంలో ఉన్న రాష్ట్రం.. ఒక్క ఏడాదిలోనే 4వ స్థానానికి ఎగబాకింది. మరోవైపు, పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పన, భూముల లభ్యత వంటి అంశాలు రానున్న రోజుల్లో తెలంగాణ వృద్ధికి మరింత దోహదపడనున్నాయి.

# తెలంగాణ ఖనిజ ఆదాయంలో రికార్డు వృద్ధి..

## 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.5,650 కోట్లు

- బొగ్గు మినహా ఇతర మినరల్స్‌తో
- దాదాపు రూ.3,300 కోట్ల ఇన్‌కమ్
- గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 33 శాతం వృద్ధి
- మేజర్ మినరల్స్‌లో 21 శాతం, మైనర్ మినరల్స్‌లో 34 శాతం
- గనుల కేటాయింపులో రాజకీయ
- జోక్యానికి తావులేకుండా బ్లాకుల వేలం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** రాష్ట్ర గనుల శాఖ ఆదాయార్జనలో రికార్డును సృష్టించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బొగ్గు మినహా ఇతర ఖనిజాల ద్వారా రూ.3,300 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 33 శాతం వృద్ధి కావడం గమనార్హం. అటు బొగ్గు గనుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని కూడా కలిపితే మొత్తం రూ. 5,650 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. ఆదాయం పెరగడానికి కేవలం ఖనిజాల వెలికితీత మాత్రమే కాకుండా, ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు కూడా తోడయ్యాయి. సీనరేజ్ ఫీజును 20 శాతం మేర శాస్త్రీయంగా సవరించడం వల్ల అదనంగా రూ.100 కోట్ల ఆదాయం లభించింది. మేజర్ మినరల్స్‌లో 21 శాతం, మైనర్ మినరల్స్‌లో 34 శాతం వృద్ధి నమోదైంది. పర్యావరణ పరిరక్షణ కోసం విధించిన ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ ఫీజుతో కూడా గణనీయమైన ఆదాయం సమకూరుతోంది. గతంలో ఖనిజ బ్లాకుల కేటాయింపులో ఉన్న అస్పష్టతను తొలగిస్తూ, కేంద్ర ప్రభుత్వ ఎంఎండీఆర్ చట్టం ప్రకారం వేలం ప్రక్రియను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తోంది. మేజర్ మినరల్స్ విభాగంలో మూడు దశల్లో 6 సున్నపురాయి బ్లాకులను వేలం వేయగా సుమారు రూ. 21.22 కోట్ల ఆదాయం లభించింది. గనుల కేటాయింపులో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా, అత్యధిక బిడ్ దాఖలు చేసిన వారికే లీజులు కేటాయించడం కలిసొచ్చింది.

**ఇసుక, మైనర్ బ్లాకుల వేలంతో పెరిగిన ఆదాయం**

కేవలం మేజర్ మినరల్స్ మాత్రమే కాకుండా, మైనర్ మినరల్స్ కేటాయింపులోనూ వేలం పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు నాలుగు దశల్లో 54 బ్లాకులను వేలం వేసి రూ. 61.49 కోట్ల రాబడిని సాధించింది. ఐదో దశలో భాగంగా మరో 16 బ్లాకులకు నోటిఫికేషన్ జారీ చేయడంతో మైనింగ్ రంగంలో పోటీ పెరిగింది. ఈ ప్రక్రియ వల్ల ప్రభుత్వానికి రావాల్సిన వాటా పైసా పోకుండా ఖజానాకు చేరుతోంది. వేలం ప్రక్రియతో పేరుగాంచిన మైనింగ్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. వికారాబాద్‌లోని కొడంగల్, సూర్యాపేటలోని పసుపులబోడు వంటి ప్రాంతాల్లోని సున్నపురాయి బ్లాకులకు భారీ డిమాండ్ ఏర్పడింది. వేలంతో వచ్చిన ఆదాయమే కాకుండా, భవిష్యత్తులో ఈ గనుల నిర్వహణ ద్వారా లభించే రాయల్టీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊతంగా మారనుంది. ఇసుక అమ్మకాలతో రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఆదాయాన్ని ఆర్జించింది. 2024-25లో రూ. 722 కోట్లుగా ఉన్న ఆదాయం, 2025-26 నాటికి 35 శాతం వృద్ధి సాధించి రూ.వెయ్యి కోట్లకు చేరుకుంది. ఇసుక బుకింగ్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఎస్ఎస్ ఎమ్ఎమ్ఎస్ వెబ్‌సైట్‌ను ఆధునీకరించడంతో పాటు, వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణను ప్రారంభించింది. 'జీరో టాలరెన్స్' విధానంతో ఇసుక అక్రమ నిల్వలు, ఓవర్ లోడింగ్‌పై ఉక్కుపాదం మోపుతోంది. కలెక్టర్లు ఎస్పీలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం ద్వారా క్షేత్రస్థాయిలో అక్రమాలకు చెక్ పెట్టి ఆదాయం పెంచుకున్నది.

**టెక్నాలజీతో మానిటరింగ్, అక్రమాలకు చెక్..**

గనుల రంగంలో దశాబ్దాలుగా సాగుతున్న అక్రమ మైనింగ్, రవాణాకు చెక్ పెట్టేందుకు గనుల శాఖ టెక్నాలజీని ఆయుధంగా మలుచుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శాటిలైట్ ఇమేజరీ ఆధారిత 'చేంజ్ డిటెక్షన్ సిస్టమ్' ద్వారా గనుల సరిహద్దుల్లో జరిగే మార్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. డ్రోన్లు, శాటిలైట్ ఫొటోలతో అక్రమ మైనింగ్‌ను గుర్తించి వెంటనే జరిమానాలు విధించేలా వ్యవస్థను రూపొందించింది. ఖనిజాలను మోసుకెళ్లే ప్రతి వాహనానికి జీపీఎస్ (ఏఎస్ 140) ట్రాకింగ్ తప్పనిసరి చేయడమే కాకుండా, క్వారీలు, క్రషర్ల వద్ద ఏఎన్‌పీఆర్ సిస్టమ్, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసింది. వే బ్రిడ్జిలను నేరుగా ఆన్‌లైన్ పోర్టల్‌కు అనుసంధానించడం ద్వారా లోడింగ్‌లో జరిగే అవకతవకలకు అడ్డుకట్ట వేసింది. ఈ మొత్తం నిఘా వ్యవస్థను రాష్ట్రస్థాయిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించి, ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంది. మైనింగ్ అనుమతుల కోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ఆన్‌లైన్ వ్యవస్థను బలోపేతం చేసింది. జీఐఎస్ ప్లాట్‌ఫామ్ తో రాష్ట్రంలోని ఖనిజ లభ్యతను మ్యాపింగ్ చేయడంతో పెట్టుబడిదారులకు స్పష్టమైన సమాచారాన్ని అందిస్తోంది. టెక్నాలజీ వినియోగం వల్ల అక్రమాలు తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు.

# యుద్ధమేఘాలు...

**ఢిల్లీ:** ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్ తీరంలోని ఓడరేవులను లక్ష్యంగా చేసుకుని అమెరికా భారీ సైనిక దిగ్బంధాన్ని ప్రారంభించింది. అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన శాంతి చర్చలు విఫలం కావడంతో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికా సైన్యం ఈ సాహసోపేతమైన చర్యకు దిగింది.

**భారీగా మోహరించిన అమెరికా బలగాలు**

అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఆపరేషన్ కోసం సుమారు 10,000 మంది సుశిక్షితులైన సిబ్బందిని రంగంలోకి దించారు. వీరిలో మెరైనర్లు, సెయిలర్లు మరియు ఎయిర్‌మెన్‌లు ఉన్నారు. ఈ దిగ్బంధనంలో 12 అత్యాధునిక యుద్ధనౌకలు, పలు యుద్ధ విమానాలు పాల్గొంటున్నట్లు తెలుస్తుంది. ఈ పరిణామాలతో గత 24 గంటల్లో అమెరికా దిగ్బంధనాన్ని దాటి ఒక్క నౌక కూడా హర్మూజ్‌ను దాటలేదని సెంట్రల్ కమాండ్ తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ధృవీకరించింది. నిబంధనలు ఉల్లంఘించి ఇరాన్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన 6 వాణిజ్య నౌకలను అమెరికా సైన్యం వెనక్కి పంపినట్లు సమాచారం.

**చర్చల విఫలమే ప్రధాన కారణం..**

పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఇటీవల జరిగిన అమెరికా-ఇరాన్ చర్చలు ఎటువంటి ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఈ ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తుంది. ఇరాన్ తన అణు కార్యకలాపాలను నియంత్రించుకోకపోవడం, హర్మూజ్ జలసంధిలో రాకపోకలు సాగించే నౌకల నుంచి అక్రమంగా టోల్ వసూలు చేయడం వంటి చర్యలను నిరసిస్తూ అమెరికా ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే, ఇతర దేశాలకు వెళ్లే నౌకలకు 'ఫ్రీడమ్ ఆఫ్ నావిగేషన్' కింద అనుమతి ఉంటుందని, కేవలం ఇరాన్ ఓడరేవులకు వెళ్లే మరియు వచ్చే నౌకలను మాత్రమే అడ్డుకుంటామని అమెరికా స్పష్టం చేసింది.

**ప్రపంచ మార్కెట్లపై ప్రభావం..**

అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో అంతర్జాతీయంగా ముడి చమురు సరఫరా పై తీవ్ర ప్రభావం పడింది. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా 7 నుంచి 8 శాతం వరకు పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధర $100 మార్కును దాటడం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు ఇరాన్ కూడా తన సైన్యాన్ని అప్రమత్తం చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఉత్కంఠ నెలకొంది.

# దళారుల చేతుల్లో రైతన్న దగా



**ముస్తాబాద్,ఫ్లాష్ ఇండియా:** మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వం అధికారికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకముందే దళారులు గ్రామాల్లోకి రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరలకు ధాన్యం సేకరిస్తూ రైతులను ఆర్థికంగా నష్ట పరుస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతుల అత్యవసర అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు ధాన్యాన్ని చౌకగా కొనుగోలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల బస్తాల వారీగా ముందస్తు ఒప్పందాలు చేసుకుని రైతులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో బహిరంగంగానే కొనుగోళ్లు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. వెంటనే సివిల్ సప్లైస్, మార్కెటింగ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమ కొనుగోళ్లను అడ్డుకోవాలని, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి..**
**బీఆర్ఎస్ నాయకుడు నగునూరి చందు**

ప్రతిసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి కూడా నిర్లక్ష్యం చేస్తే రైతులు మరింతగా దళారుల బారిన పడే పరిస్థితి ఏర్పడుతుందని, రైతుల బతుకులు ఆగమైతయని అన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

**రైతులు మోసపోకుండా చర్యలు తీసుకోవాలి..కుంబాల మల్లారెడ్డి రైతు, అవునూర్**

గ్రామాల్లో దళారులు నిర్ణయించిన ధరకే ఇవ్వడంతో రైతులు మోసపోతున్నారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ మద్దతు ధర కే కొనుగోలు జరిగేలా అధికారులు రైతులను ఆదుకోవాలి.

# యూరప్ వెళ్లాలనుకున్న నిరుద్యోగులు..

**యూరప్ వెళ్లాలనుకున్న నిరుద్యోగులు.. చివరకు చేరింది ఎక్కడికో తెలుసా..?**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్ పోలీసులు నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని లక్షలాది రూపాయలు కాజేస్తున్న ఒక భారీ విదేశీ ఉద్యోగాల ముఠా గుట్టును రట్టు చేశారు. యూరప్ దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగులను నిలువునా ముంచుతున్న "ట్రివియల్ చాప్టర్" అనే సంస్థపై ఉక్కుపాదం మోపిన పోలీసులు, ఆ సంస్థకు చెందిన ఇద్దరు కీలక వ్యక్తులను అరెస్ట్ చేశారు. విదేశాలకు వెళ్లి లక్షల్లో సంపాదించాలనే కోరికతో ఉన్న యువతను లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠా, ముఖ్యంగా గ్రీస్, రొమేనియా, ఇటలీ మరియు సెర్బియా వంటి దేశాల్లో వర్క్ వీసాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఇందుకోసం సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లను వేదికగా చేసుకుని ఆకర్షణీయమైన ప్రకటనలతో బురిడీ కొట్టించారు. ఈ కేటుగాళ్లు ఒక్కో అభ్యర్థి నుంచి సుమారు 4 లక్షల నుంచి 5 లక్షల రూపాయల వరకు వసూలు చేసి, నమ్మకం కలిగించడానికి ఆన్‌లైన్ టెంప్లేట్ల ద్వారా సృష్టించిన నకిలీ ఆఫర్ లెటర్లు, 'వర్క్ ఆథరైజేషన్' పత్రాలను అందజేశారు. ఒకసారి డబ్బు చేతికి అందాక బాధితుల ఫోన్ కాల్స్ ఎత్తకుండా, కనీసం సందేశాలకు కూడా సమాధానం ఇవ్వకుండా ముఖం చాటేసేవారు. విచారణలో ఈ సంస్థకు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి ఎటువంటి అధికారిక రిక్రూట్‌మెంట్ ఏజెంట్ లైసెన్స్ లేదని తేలింది.

# మహిళా బిల్లుకు సంపూర్ణ మద్దతు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** భారత ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బుధవారం ఎర్రవెల్లి నివాసంలో పార్టీ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావులతో భేటీ అయిన ఆయన.. జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేంద్రానికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.



**మహిళా బిల్లుకు సంపూర్ణ మద్దతు**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. "మేము అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ల కోసం తీర్మానం చేశాం. ఈ బిల్లుకు రాజ్యసభలో మా ఎంపీలు మద్దతు ఇస్తారు" అని ఆయన స్పష్టం చేశారు.

**డీలిమిటేషన్‌పై 'దక్షిణాది' ఆందోళన**

నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఉంటే దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని తేల్చి చెప్పారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24% ఎంపీ సీట్లు ఉన్నాయని, భవిష్యత్తులో సీట్లు పెంచినా ఈ శాతం తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని, అంతవరకు తొందరపడవద్దని పార్టీ నేతలకు కేసీఆర్ సూచించారు.

**పార్టీ కార్యక్రమాలపై చర్చ..**

రాజకీయ అంశాలతో పాటు పార్టీ సంస్థాగత కార్యక్రమాలపై కూడా కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ, అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కేటీఆర్, హరీష్ రావులను ఆదేశించారు.

# మా వైఖరిలో ఎలాంటి మార్పు లేదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై చర్చ ముదురుతున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆసక్తికరంగా స్పందించారు. ఈ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, అవసరమైతే బలమైన ప్రజా ఉద్యమం వస్తుందని మూడేళ్ల క్రితమే చెప్పినట్లు.. పాత పోస్టును ట్యాగ్ చేశారు.



నియోజకవర్గాల పునర్విభజనపై 2023 సెప్టెంబరులో తాను చేసిన 'ఎక్స్' (ట్విట్టర్) పోస్టును కేటీఆర్ తాజాగా రీ-ట్వీట్ చేశారు. "నియోజకవర్గాల పునర్విభజనపై మూడేళ్ల క్రితమే బీఆర్ఎస్ తన స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మా వైఖరిలో ఎలాంటి మార్పు లేదు" అని ఆయన స్పష్టం చేశారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, దశాబ్దాలుగా జనాభా నియంత్రణ పాటిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆ పోస్టులో ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధిని, ఆకాంక్షలను ఢిల్లీ పాలకులు వింటారని, తమ వాదనలోని న్యాయాన్ని గుర్తిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియను 2011 జనాభా లెక్కల ప్రకారం చేపడుతుందా లేక తాజా లెక్కలను తీసుకుంటుందా అన్న ఉత్కంఠ కొనసాగుతున్న నేపథ్యంలో కేటీఆర్ చేసిన ఈ పోస్ట్ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరుగుతాయని అంచనాలు ఉన్నప్పటికీ, జాతీయ స్థాయిలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందని బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# మిర్యాలగూడలో ఐపీఎల్ బెట్టింగ్ 'జోరు'..




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** క్రీడలు అంటే ఒకప్పుడు ఆనందంగా గడపడం..ఆహ్లాదం పంచడం.. ఆస్వాదించడం.. కానీ ఇప్పుడు ఐపీఎల్ అంటే బెట్టింగ్ అన్నట్లుగా మారింది. ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ ( ఐపీఎల్ ) క్రికెట్ ఫీవర్ రాష్ట్రంలో బాగుంది. దీంతో ఆటలో ఆనందం కంటే బెట్టింగ్ కు ప్రాధాన్యం పెరిగింది. ఆన్ లైన్ బెట్టింగ్ తో పాటు ఆఫ్ లైన్ మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంతాలలో జోరుగా సాగుతోంది. లక్షలాది రూపాయాలు రాత్రికి రాత్రి చేతులు మారుతున్నాయి. క్రికెట్ అంటేనే బెట్టింగ్ అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. లక్షల రూపాయాలు వెచ్చించి బెట్టింగ్ లో పాల్గొని అప్పుల పాలైతున్న సంఘటనలు ఉన్నాయి. ఈ పెనుభూతం పడగ విప్పి ఎన్నో కుటుంబాలను ఛిద్రం చేస్తుంది. మిర్యాలగూడలో క్రికెట్ బెట్టింగ్ అడ్డాగా మారుతుంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో కొందరు వ్యక్తులు బెట్టింగ్ నిర్వహణ సాగిస్తున్నారని సమాచారం. ఈ బెట్టింగ్ ముఖ్యంగా హోటల్స్ , మద్యం సిట్టింగ్, దాబాల వద్ద నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా అద్దంకి రహదారిపై ఉన్న దాబాలు వద్ద రాత్రి వేళ ప్రోజెక్టర్ ద్వారా స్క్రీన్ లు ఏర్పాటు మ్యాచ్ లు ప్రదర్శిస్తున్నారు. దీంతో యువకులు దాబాల్లో ,హెటల్స్ ,మద్యం సిట్టింగ్ ల వద్ద మ్యాచ్‌లను తిలకిస్తూ బెట్టింగ్ దందా నడిపిస్తున్నారు. అంతేకాకుండా దాబా ల వద్ద మద్యం తాగుతూ క్రికెట్ చూస్తూ బెట్టింగ్ లో హంగామా చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల క్రికెట్ చూస్తూ మద్యం మత్తులో ఘర్షణ పడగా పోలీసుల దృష్టి కి వెళ్లినట్లు సమాచారం. మ్యాచ్ ప్రారంభంలో గెలుపు ఓటమిల కు సంబంధించి రేటింగ్‌ను గెలిచే జట్టును బట్టి రూ. 1000 కి 1200 ,రెటింగ్ తక్కువ ఉన్న జట్టుకు రూ. 500 లకు రూ. 700 చొప్పున బెట్టింగ్ సాగిస్తున్నారు. ప్రతి రోజు లక్షలాది రూపాయలు బెట్టింగ్ లో డబ్బు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది.

**తీవ్రంగా నష్టపోతున్న యువత..**

ఒకవైపు ఆన్ లైన్ యాప్ ల ద్వారా రుణాలు పొంది తీర్చలేక అత్మహత్యల సంఘటనలు జరుగుతున్నపటికీ బెట్టింగ్ భూతం వైపు యువత మొగ్గు చూపుతున్నారు. ఈ క్రికెట్ లో అధిక సంఖ్యలో యువత పాల్గొంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. కొందరు యువకులు తమ వద్ద డబ్బులు అయిపోయి బంగారం , వాహనాలను తాకట్టుపెట్టి బెట్టింగ్ కు బానిసలుగా మారుతున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో లక్షల రూపాయలు బెట్టింగ్ లో పెట్టి నష్టపోతున్నారు.

**నామా మాత్రంగా పోలీసుల నిఘా ?**

మిర్యాలగూడ పట్టణం తో పాటు పరిసర గ్రామాల లో సైతం బెట్టింగ్ నిర్వహణ సాగుతుంది. అయితే బెట్టింగ్‌లపై నిఘా పెంచాల్సిన పోలీసులు నామా మాత్రంగా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలో ఉన్న హోటల్ , దాబాలు రాత్రి 12 గంటలకు మూసివేయాలని గట్టి గస్తీ నిర్వహణ చేస్తున్నప్పటికీ బెట్టింగ్ పై దృష్టి సారించడంలో జాప్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బెట్టింగ్ తో పాటు రాత్రి వేళ గంజా కూడా తాగి మత్తుకు యువత బానిసలైతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన పోలీసులు నిఘా పెంచి బెట్టింగ్ కు పాల్పడుతున్న నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బాలికల వసతి గృహంలో విద్యార్థిని మృతి..

**ఎల్లారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** బాలికల వసతి గృహంలో విద్యార్థిని మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ బాలికల వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న శ్రావణి అనే విద్యార్థి బుధవారం తెల్లవారుజామున వసతి గృహం వరండాలో పడి మృతి చెంది ఉంది. శ్రావణి తెల్లవారుజామున వాష్ రూమ్ కోసం వెళ్లి వస్తుండగా, పడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. వరండాలో విద్యార్థిని పడిపోవడాన్ని గమనించిన వసతి గృహం సిబ్బంది, హుటాహుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శ్రావణిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్డీవో ప్రభాకర్ తహసీల్దార్ ప్రేమ్, సీఐ రాజిరెడ్డి, ఎస్సై మహేష్ ఆసుపత్రి నుండి అనంతరం విచారణ నిమిత్తం వసతి గృహానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

**విద్యార్థిని మృతిపై అనుమానం ఉందని ఫిర్యాదు..**

నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్‌నకు చెందిన శ్రావణి తండ్రి లేకపోవడంతో వసతి గృహంలో ఉండి నాలుగేళ్లుగా చదువుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. శ్రావణి తల్లి, అన్న, అక్క హైదరాబాద్‌లో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే శ్రావణి మృతి చెందడంతో హాస్టల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయమై అధికారులు వైద్యులతో, విద్యార్థులతో చర్చించారు. అయితే వసతి గృహంలో నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపిస్తూ హాజీపూర్ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. వారంతా స్థానిక పోలీస్‌స్టేషన్ కు తరలి వెళ్లి విద్యార్థిని మృతిపై అనుమానం ఉందని విద్యార్థిని తల్లి లక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆసుపత్రి వద్ద ధర్నా..**

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేదలకు నాణ్యమైన విద్యతో పాటు భద్రత కూడా లేదని, హాస్టల్ వార్డెన్ కూడా స్థానికంగా లేకపోవడం.. ఇదంతా చూస్తే సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే విద్యార్థిని ప్రాణం కోల్పోవాల్సి వచ్చిందని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం సిగ్గుచేటని ఆరోపించారు. విద్యార్థిని కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు ఆసుపత్రి వద్ద విద్యార్థిని కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేశారు. ఇంత జరిగిన జిల్లా కలెక్టర్ అధికారులు స్పందించకపోవడం అధికారుల వైఫల్యమే కారణమని ఆరోపించారు. పోలీసులు మాజీ ఎమ్మెల్యే సురేందర్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## మోసపోయిన యువతి...

**ఇల్లెందు,ఫ్లాష్ ఇండియా :** ప్రేమ పేరుతో మోసం చేసి ముఖం చాటేసిన యువకుడి ఇంటి ముందు యువతి బైఠాయించిన సంఘటన ఇల్లెందు మండలం ధనియాలపాడు పంచాయతీ బాలాజీ తండాలో జరిగింది. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రేగుల తండాకు చెందిన భూక్య వెన్నెల తన అమ్మమ్మ స్వగ్రామమైన బాలాజీ తండాలో కొద్ది రోజులు ఉంది. ఈ క్రమంలో బాలాజీ తండాలోని నునావత్ మహేందర్‌తో నాలుగేళ్లుగా ప్రేమాయణం కొనసాగింది. ఈ క్రమంలో గత కొంతకాలంగా ప్రేమ వివాహం చేసుకుంటే కట్నం రాదని దురుద్దేశంతో యువతికి దూరమవుతూ వచ్చాడు. ఫోన్ చేస్తే స్పందించకపోవడం వల్ల యువతి మనస్తాపానికి గురై ఉరివేసుకుని చనిపోయేందుకు సిద్ధపడింది.

**నాతో పాటు నా తల్లిని కూడా కొట్టారు..**

యువతి తల్లి విషయం తెలుసుకుని, యువకుడి తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్లి చేసేందుకు నాలుగు రోజులుగా యువకుడి స్వగ్రామానికి పెద్దలతో వచ్చివెళ్తుంది. నాలుగు రోజులుగా రేపు మాపు అంటూ కాలం వెళ్ళబుచుతున్న తరుణంలో బుధవారం యువతి భూక్య వెన్నెల ప్రియుడి ఇంటి ముందు బైఠాయించింది. దీంతో యువకుడి కుటుంబ సభ్యులు యువతి, యువతి తల్లిపై దాడి చేశారు. ఈ క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా యువతి భూక్య వెన్నెల మాట్లాడుతూ.. తనకు న్యాయం చేయాలని నాలుగేళ్లుగా ప్రేమ పేరుతో మోసం చేశాడని పేర్కొంది. న్యాయం కోసం ఇంటికి వస్తే తనతో పాటు తన తల్లిని విచక్షణారహితంగా కొట్టారని ఏడ్చుకుంటూ తెలిపింది.

# రైజింగ్ రామగుండం



**గోదావరిఖని,ఫ్లాష్ ఇండియా :** రైజింగ్ రామగుండం గా పేరు తీసుకువచ్చేందుకు వేము సైతం అంటూ ప్రతి ఒక పౌరుడు కదలి రావాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగశీగా 9వ డివిజన్ లో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి బుధవారం వార్డు సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామగుండం నగరాన్ని ఒక స్వచ్ఛమైన అద్భుత నగరంగా తీర్చిదిద్దడం పౌరుల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అన్నారు. నగరంలోని నాలాల పూడిక తీత ఒక దశాబ్ద కాలంగా చేపట్టడం జరగలేదని అన్నారు. ప్రస్తుతం రామగుండం నగర పాలక సంస్థకు సమర్థత ,అనుభవం కలిగిన పాలక వర్గం ఏర్పడిన క్రమంలో శానిటేషన్ తో పాటు అన్ని సమస్యలు తీరిపోతాయని అన్నారు. వర్షాకాలంలో వరద ముప్పు తో పాటు దుర్గంధం నుండి ప్రజలు పడుతున్న ఇబ్బందులు నివారించడానికి పూర్తి స్థాయిలో కాంక్రీట్ కాలువ నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు. ఊరంటే రామగుండంలా ఉండాలి అనే విధంగా ఈ నగరాన్ని రూపుదిద్దుకుందామని అన్నారు.

**మేము సైతం అంటూ ప్రతి ఒక పౌరుడు కదలి రావాలి**


రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ.. కాలువలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. మునిసిపల్ సిబ్బందికి చెత్త ఇవ్వాలని అన్నారు. వర్షాకాలం లోపు నగరంలోని అన్ని నాళాల్లో పూడిక తొలగించే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని అన్నారు. ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వినోభా నగర్, రెల్లి వాడ లో ప్రవహిస్తున్న మురుగు నీటి కాలువలో యంత్రాలు, సిబ్బంది సహాయంతో పూడిక తొలగించి సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే, మేయర్ అధికారులకు ,సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.

ప్రెస్ క్లబ్ నుండి ప్రారంభించి గల్లీ గల్లీలో తిరుగుతూ మునిసిపల్ సిబ్బందికి సూచనలు ఇస్తూ పిచ్చి చెట్లు, కొమ్మలు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ తాళ్లపెల్లి యుగంధర్ తో పాటు పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఇ ఇ పి వి రామన్, టి పి ఎస్ నవీన్ , ఎ ఇ జమీల్ , సానిటరీ ఇన్స్పెక్టర్ రంగు నాగ భూషణం, సూపర్ వైజర్ రవి కుమార్ , ఎలక్ట్రికల్ ఎ. ఇ. రాంజీ , వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కాంగ్రెస్ పార్టీ

**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిందని పార్టీ సూచనతో ప్రభుత్వం నడవాలి కానీ ప్రభుత్వం సూచనతో పార్టీ నడుస్తుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నిన్న రేవంత్ రెడ్డి తన పట్ల చేసిన వ్యాఖ్యలకు జీవన్ రెడ్డి ఘాటుగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిందని అలాంటి కంపెనీలో బ్యాండ్ వాగన్ గా నేను కొనసాగలేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి పై పార్టీ పట్టు కోల్పోయిందని పార్టీ సూచనల మేరకు ప్రభుత్వం నడవాలని కానీ రేవంత్ ప్రభుత్వం సూచనల మేరకు పార్టీ పని చేస్తుందని అన్నారు. పదవులు ఎప్పటికీ శాశ్వతం కాదని పదవులే కావాలి అనుకుంటే నీ దగ్గర పడిగాపులు కాసేవాడిని అని నేను అన్ని పదవులు చూసాను నువ్వు ఏమి చూశావో నాకు తెలీదు అని విమర్శించారు. నేను కేసీఆర్ పట్ల విధానపరమైన విమర్శ చేశాను తప్ప వ్యక్తిగతంగా ఏనాడు విమర్శించలేదని కేసీఆర్ నా వయసుకు గౌరవం ఇస్తూ నన్ను అన్న అని పిలుస్తాడు నీలాగా కాదు అని కౌంటర్ ఇచ్చాడు. పిల్లిని లోపల వేసి కొడితే తిరుగపడుతది అని హెచ్చరించారు.



# మీ ఇంటి ఆడబిడ్డను ఇట్లా ఏడిపిస్తారా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రముఖ సింగర్ మంగ్లీ ప్రమేయం ఉందంటూ ప్రచారం జరుగుతున్న మైక్రో ఫైనాన్స్ కేసు లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన వ్యక్తిగా ఉన్న మధు అప్రూవర్‌గా మారారు. ఈ సందర్భంగా ఆయన మీడియాలో మాట్లాడుతూ.. అసలు ఈ కేసుతో సింగర్ మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. హేమాకాంత్ రెడ్డి అనే వ్యక్తి తనను మోసం చేశాడని, కంపెనీలో పెట్టిన సుమారు రూ. 20 కోట్లను ఆయనే తీసుకున్నాడని మధు ఆరోపించారు. అడ్వకేట్ సుబ్బారావు, హేమాకాంత్ రెడ్డి ఇద్దరూ స్నేహితులని ఆయన పేర్కొన్నారు.

**దయచేసి నా ఫోటోను వాడకండి..**

మరోవైపు, ఈ వివాదంపై సింగర్ మంగ్లీ స్పందిస్తూ మీడియా ముందు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 'నాన్న అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి నన్ను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. ఎవరికైనా అమ్మనాన్నలే అతిపెద్ద ఎమోషన్. కానీ మీడియాలో, టీవీల్లో ఈ కేసుకు సంబంధించి నా ఫోటోలు చూసి వారు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు' అని మంగ్లీ ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రతి ఒక్కరికీ కుటుంబాలు ఉంటాయి. మీడియాలో చూపే విధానాన్ని బట్టే ప్రజలు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. నన్ను ఇలా తప్పుగా చూపించడం వల్ల సోషల్ మీడియాకు, కొందరికి వచ్చే లాభం ఏంటి?' అని ఆమె ప్రశ్నించారు. తన పేరు చెప్పి కొందరు డబ్బు వసూలు చేశారని, వారిపై ఇప్పటికే కేసులు పెట్టామని ఆమె తెలిపారు. మోసపోయిన బాధితులకు తాను తప్పకుండా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. 'దయచేసి ఈ వివాదంలో నా ఫోటోలను వాడకండి. నేను తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే నన్ను జైలుకు పంపండి. నేను ఏ తప్పూ చేయలేదు, అందరికీ నిజాలు తెలిసినా అసత్యాలు ప్రచారం చేయడం మా కుటుంబాన్ని తీవ్రంగా కలచివేస్తోంది. మీ ఇంటి ఆడబిడ్డను ఇలా ఏడిపిస్తారా?" అని మంగ్లీ కన్నీటి పర్యంతమయ్యారు.

# బీరు.. టాప్ గేరు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వేసవి తాపం చల్లార్చుకోవడం చాలా కష్టం. ఎందుకంటే ఏ ఏటికి ఆ ఏడు ఉష్ణోగ్రతలు దారుణంగా పెరిగిపోతు న్నాయి. దాంతో సమ్మర్ అంటేనే హడ లిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి వేసవిని తట్టుకు నేందుకు మిగిలిన వారి సంగతి ఎలా ఉన్నా మందు బాబులు మాత్రం కొత్త రూట్ని కనిపెట్టారు. వేడిని కూల్ చేసే సత్తా బీర్ కే ఉందని నమ్మిన వారంతా అందులో మునిగితేలుతున్నారు. బీరు కొట్టు గురూ.. కూల్ గురూ అంటూ బిగ్ సౌండ్ చేస్తున్నారు.

**చల్లగా దిగుతోంది..**

బీరు కొడితే హాయిగా ఉంటోందిట. చల్లగా గొంతులోకి దిగుతోందిట. దాంతో మందు బాబులు మత్తెక్కించే ఇతర బ్రాండ్లను పక్కన పెట్టి మరీ బీరు తీసుకోవడానికే చూస్తున్నారు. దానికే ఓటేస్తున్నారు. ఎండ ధాటికి గొంతు ఎండిపోవడమే కాదు మండిపోతోంది. దానికి సరైన మందు బీరు అని వారు గట్టిగా నమ్ముతున్నారు. దాంతో బీరు స్టాక్ లేకుండా అమ్ముడైపోతోంది. ఎక్కడి కక్కడ ఏపీ, తెలంగాణలో ఒక్కసారిగా బీరు సేల్స్ పెరిగిపోయినట్లుగా డేటా చెబుతోంది. ఏపీలో గత ఏప్రిల్ నాటికి ఈ రోజుకీ మధ్య ఏకంగా 30 శాతానికి పైగా అమ్మకాలు పెరిగాయి.

**బీరు టాప్ గేరు..**

రానున్న మూడు నెలలూ బీరు సేల్స్ టాప్ గేరులో ఉండొచ్చని వ్యాపారులు అంటున్నారు. ఇంకో విషయం ఏమిటంటే మందు తాగడం పెద్దగా అలవాటు లేని వారు సైతం బీరు వైపు మొగ్గు చూపిస్తున్నట్టు తెలుస్తోంది. సాఫ్ట్ డ్రింక్గా దీన్ని భావిస్తున్నారా లేక కూలింగ్ కోసం ఈ విధంగా ఆలోచిస్తు న్నారా అన్నది పక్కన పెడితే బీరుకే మా ఓటు అంటున్నారు. బయట ఎక్కువగా తిరిగే వారు ఎండలలో పనిచేసే వారు లిక్కర్ అంటే పక్కన పెట్టి బీరుకే మొగ్గు చూపించడంతో ఈ సీజన్ పూర్తిగాబీరుకే అంకితం అవుతోంది. ఏప్రిల్ నెలలోనే సంచలన అమ్మకాలు నమోదు చేసుకున్న బీరు రానున్న కాలంలో మరెన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందో అని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఏది ఏమైనా బీరు కే జై సమ్మర్ కి బై బై అంటూ న్యూ ట్రెండ్ ని క్రియేట్ చేస్తున్న వైనం అయితే ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో కనిపిస్తోంది.

**మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు..**

మరో వైపు మే నెలలో ఎండలు ఇంకా ఎక్కువగా ఉంటాయని అధికారులు అంటున్నారు.

దాంతో బీరు అమ్మకాలు ఇంతకు ఇంత పెరుగుతాయని లెక్క వేస్తున్నారు. వేసవి తాపాన్ని, దాహాన్ని ఆపే శక్తి బీరుకే ఉందని మందు బాబులు భావించడమే కాదు బీరుకే మా ఓటు అంటూ ఏకధాటిగా ఈ వైపుకే దాడి చేయడంలో ఎక్కడ లేని అమ్మకాలు బీరు పరం అవుతు న్నాయి. దీంతో మిగిలిన లిక్కర్స్ ఉన్నా అన్నీ కూడా బీరు జోరు ముందు దిగదుపు అవుతున్నా యని అంటున్నారు.


# కేజీబీవీ నిర్వాహణ పై కలెక్టర్ ఖుష్బూ గుప్తా కన్నెర్ర

**మహబూబ్ నగం,ఫ్లాష్ ఇండియా :** మహ్మదాబాద్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గండీడ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యాలయ నిర్వహణ పై కన్నెర్ర చేశారు. ఈ సందర్భంగా విధులలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పాఠశాల సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకున్నారు. పాఠశాలలో సరైన పర్యవేక్షణ చేయకుండా ఉద్యోగ నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు కేజీబీవీ ప్రత్యేక అధికారి డి.పావని ని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. అలాగే సిఆర్ టీ ఇంగ్లీష్ అధ్యాపకురాలైన శోభ విద్యార్థులకు పాఠాలు సరిగా చెప్పనందుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పాఠశాల నైట్ వాచ్ మెన్ జైతున్ బేగం, తన భర్త ద్వారా నైట్ డ్యూటీ చేయిస్తున్నందున సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలోని 7, 8, 9 వ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతూ, బాగా చదువుతున్నారా? టీచర్లు పాఠాలు సరిగా బోధిస్తున్నారా? లేదా? పాఠశాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి? అనే విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

**మెనూ ప్రకారం భోజనం అందించాలి**

విద్యార్థుల ఆరోగ్యం గురించి ఆరా తీస్తూ, హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉన్నది, తరచుగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని డార్మెటరీ ని సందర్శించి పరిశీలించారు. డార్మెటరీ లో ఫ్యాన్లు, లైట్లు సరిగా పనిచేయకపోవడాన్ని కలెక్టర్ గుర్రుమన్నారు. ఈ వేసవిలో వేడి ఎక్కువగా ఉన్నందున డార్మెట్రీలో, తరగతి గదులలో కచ్చితంగా ఫ్యాన్లు, లైట్లు ఉండేటట్లు చూసుకోవాలని హెచ్చరించారు. వర్షాకాలంలో సీలింగ్ పైకప్పు నుంచి తరచూ నీరు కారుతుందని విద్యార్థులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు శుభ్రమైన త్రాగు నీరు అందించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, వాటిలో నీటి వసతి సరిగా ఉన్నదా లేదా అనే విషయాలను కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆమె స్టోర్ రూము ను సందర్శించి స్టాక్ రికార్డును పరిశీలించారు. పప్పు, బియ్యం, నూనె, కూరగాయల స్టాక్ వివరాలు ఎందుకు సరిగా నిర్వహించడం లేదని అక్కడున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనుంచి అధికారులు జాగ్రత్తగా పని చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని, చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్ గౌడ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచిత పెరుగన్నం పంపిణీ...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణం లో బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతిరోజు మధ్యాహ్నం 3 వేల మందికి పంపిణీ చేసే ఉచిత పెరుగన్నం పంపిణీ కార్యక్రమం 2వ రోజు ప్రారంభించిన దంపతులు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వారి సతీమణి లిబత్తుల మాధవి లు పెరుగన్నం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి విచ్చేసే ప్రజలకు,రైతులకు, ఉపసమనం కోసం రోజు దాదాపు 3 వేల మందికి పంపిణీ చేయడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమం జూన్ 2వ తేదీ వరకు కొనసాగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# కారులో చిక్కుకొని ఊపిరాడక బాలిక మృతి..

**నార్కట్‌పల్లి,ఫ్లాష్ ఇండియా :** కారులో చిక్కుకొని ఊపిరాడక చిన్నారి మృతి చెందిన సంఘటన నార్కట్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేర్ని సతీష్-గాయత్రి దంపతులకు చిన్నారి చరణ్య (5), భాను ఇద్దరు సంతానం. అయితే మృతురాలు చిన్నారి ఆడుకునేందుకు రోజులాగే ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఇంటి బయట ఉన్న కారులోకి వెళ్లి వెనుక సీట్‌లో కూర్చుంది. అంతలోనే ఏమైందో తెలియదు కానీ ఆ డోర్లు బయటికి రాకపోవడంతో చిన్నారి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. చాలాసేపటి నుంచి కనిపించకపోవడంతో తన తల్లి చుట్టుపక్కలా వెతికింది. అయినా ఎక్కడ కనిపించలేదు. ఇంతలోనే కారు బయట ఉన్న చెప్పులను చూసి కారులో చూడగా.. ఆ మృతురాలు చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లి ఉంది. వెంటనే తల్లితో పాటుగా తన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. పేర్ని సతీష్-గాయత్రి దంపతుల కుటుంబం 20 ఏళ్ల క్రితం బతకడం కోసం ఇక్కడికి వలస వచ్చారు. ఇక ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై విష్ణుమూర్తి తెలిపారు.




# టీమిండియాలో విపత్తు తప్పదు..


టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను తొలగిస్తే టీమిండియాలో విపత్తు తప్పదని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భారత మాజీ పేసర్ మునాఫ్ పటేల్ భారత క్రికెట్ నియంత్రణ మండలి ని హెచ్చరించాడు. 2024 టీ20 ప్రపంచ కప్ విజయం తర్వాత రాహుల్ ద్రవిడ్ స్థానంలో గంభీర్‌కు ఈ ప్రతిష్టాత్మక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. దాదాపు రెండేళ్ల గంభీర్ సారథ్యంలో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. కీలక ఆటగాళ్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను టెస్ట్ క్రికెట్ నుంచి బలవంతంగా రిటైర్ చేయించారనే ఆరోపణలను గంభీర్ ఎదుర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ.. ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్, టీ20 ప్రపంచ కప్ వంటి మూడు ప్రధాన ట్రోఫీలు గౌతమ్ సారథ్యంలోనే వచ్చాయి. కానీ.. టెస్ట్ క్రికెట్‌లో తడబడటంతో కోచ్‌గా తొలగించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2011 ప్రపంచ కప్ గెలిచిన జట్టు సభ్యుడైన మునాఫ్ పటేల్ తన మాజీ సహచరుడికి మద్దతిచ్చారు. గంభీర్‌ను తొలగిస్తే పరిస్థితులు దిగజారవచ్చని హెచ్చరించారు."గంభీర్ వంటి నిఖార్సైన వ్యక్తిని కోచ్ పదవి నుంచి తొలగిస్తే, భారత జట్టులోని స్టార్ ఆటగాళ్లను మేనేజ్ చేయడం ఎవరికైనా చాలా కష్టమవుతుంది. గంభీర్ అత్యంత నిజాయితీ గల వ్యక్తి. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడటం వల్ల చాలా మంది అతడిని ఇష్టపడరు. కానీ జట్టు ప్రయోజనాల కోసం ఎంతటి కఠిన నిర్ణయాలనైనా తీసుకోవడానికి వెనుకాడరు. ముఖ్యంగా జట్టులో క్రమశిక్షణ తప్పినా లేదా ఆటగాళ్లు సరిగ్గా రాణించకపోయినా, వారిని జట్టు నుంచి తప్పించే ధైర్యం గంభీర్‌కు ఉంది. విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాళ్లకు 'నో' చెప్పడం అంత తేలికైన విషయం కాదు. కేవలం దేశం కోసం కోచ్‌గా సేవలు అందిస్తూ గంభీర్ ఎంతో మంది శత్రువులను కూడగట్టుకున్నాడు. క్రికెట్‌లో మ్యాన్ మేనేజ్‌మెంట్ అనేది అత్యంత కష్టమైన పని. గంభీర్ దానిని సమర్థవంతంగా చేస్తున్నారు." అని మునాఫ్ వెల్లడించారు. ఇక ప్రస్తుతం మునాఫ్ పటేల్ ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ జట్టు ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించి, నాలుగు పాయింట్లతో పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతోంది.

# ఇక ఐపీఎల్ 2026లో 'బుడ్డోడి'కి కష్టమే?



ఐపీఎల్ 2026లో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత బ్యాటింగ్‌తో అలరిస్తున్నాడు. రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) తరఫున ఆడుతున్న వైభవ్.. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 5 మ్యాచ్‌లలో 200 పరుగులు చేశాడు. 260కి పైగా అధిక స్ట్రైక్ రేట్‌తో రన్స్ చేయడం విశేషం. బౌలర్లకు పెను సవాల్‌గా మారుతున్న సమయంలో.. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) పేసర్ ప్రఫుల్ హింగే మొదటి బంతికే వైభవ్‌ను డకౌట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎస్ఆర్‌హెచ్ తరఫున అరంగేట్రం చేసిన హింగే.. ముందుగానే వేసుకున్న ప్లాన్‌ను చక్కగా అమలు చేసి వైభవ్‌ను గోల్డెన్ డక్‌గా ఔట్ చేయడం మ్యాచ్ టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో తాజాగా జరిగిన మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ 217 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆర్ఆర్‌కు నిర్దేశించింది. అందరూ వైభవ్‌పై భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రఫుల్ హింగే మొదటి బంతికే అతడిని పెవిలియన్‌కు పంపించాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన హింగే.. వైభవ్‌ను బౌన్సర్‌తో లేదా మరో విధంగా ఔట్ చేస్తానని తన సన్నిహితులకు ముందుగానే చెప్పానని వెల్లడించాడు. అతడు వ్యాఖ్యలు సిల్లీగా అనిపించినా.. అమలు చేయడం మాత్రం అంత ఈజీ కాదు. కానీ చెప్పినట్లే వైభవ్‌ను అవుట్ చేసి క్రికెట్ ప్రపంచానికి పరిచయం అయ్యాడు. ప్రఫుల్ హింగే విజయానికి కారణం అతని లైన్-లెంగ్త్ కచ్చితత్వమే అని ఎంఆర్ఎఫ్ పేస్ ఫౌండేషన్ చీఫ్ కోచ్ ఎం. సెంథిల్ నాథన్ చెప్పారు. ఆధునిక క్రికెట్‌లో బ్యాటర్ బలహీనతలను గుర్తించడం పెద్ద విషయం కాదని, కానీ వాటిని మైదానంలో అమలు చేయడం కీలకమని పేర్కొన్నారు. హింగే సరిగ్గా అదే చేశాడని ఆయన చెప్పారు. హై బ్యాక్‌లిఫ్ట్‌తో ఆడడం, ఫ్రంట్ లెగ్‌ను ముందుకేసి భారీ షాట్లు ఆడే ప్రయత్నం చేయడం వైభవ్ బలహీనత అని నిపుణులు అంటున్నారు. ఈ కారణంగా స్టంప్స్‌పై లేదా శరీరానికి దగ్గరగా వేసే బంతులకు అతడిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. హింగే అదే వ్యూహాన్ని అనుసరించి.. హార్డ్ లెంగ్త్ బంతితో అతడిని బోల్తా కొట్టించాడు. హింగే మాదిరి ఇతర స్టార్ బౌలర్లు ప్రయత్నించినప్పటికీ.. అమలులో చిన్న తప్పిదాలు చేశారు. టాప్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వేసిన బౌన్సర్ కొద్దిగా తక్కువలో రావడంతో వైభవ్‌కు టైమ్ దొరికింది. ఆసీస్ స్టార్ జోష్ హేజిల్‌వుడ్ వేసిన బంతి కూడా బ్యాటర్‌కు అనుకూలంగా వచ్చింది. కానీ హింగే మాత్రం తన లెంగ్త్‌ను కచ్చితంగా వేసి.. వైభవ్‌కు స్పేస్ ఇవ్వకుండా ఔట్ చేశాడు. వైభవ్‌ను హింగే అవుట్ చేసిన అనంతరం అందరిలో ఓ ప్రశ్న తలెత్తుతోంది. ఇకపై మిగతా బౌలర్లు కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించనున్నారు. బౌలర్లు వైభవ్ బలహీనతలను టార్గెట్ చేస్తే.. వాటిని అధిగమించి తిరిగి ఎలా రాణిస్తాడన్నది చూడాలి. ప్రతిభ ఎంత ఉన్నా.. కచ్చితమైన ప్లాన్, అద్భుతమైన ఎగ్జిక్యూషన్ ముందు ఏ బ్యాటర్ అయినా అవుట్ అకావాల్సిందే అని హింగే నిరూపించాడు.

# ఇకపై ఆడాలా? వద్దా?



రోహిత్ శర్మ గాయంపై ముంబై ఇండియన్స్ అభిమానుల్లో గందరగోళం నెలకొంది. మంగళవారం జరిగిన నెట్ సెషన్స్‌లో రోహిత్ ఎక్కడా కనిపించలేదు. దీంతో రోహిత్‌కు గాయం పెద్దదిగా మారిందని అందరూ అభిప్రాయపడుతున్నారు. గురువారం పంజాబ్ కింగ్స్‌తో జరగబోయే మ్యాచ్‌లో రోహిత్ ఆడతాడా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇంతలో హిట్‌మ్యాన్ హెల్త్ రిపోర్టు వెలువడింది. క్రికెట్ బజ్ తాజా నివేదిక ప్రకారం.. మ్యాచ్ అనంతరం రోహిత్‌కు స్కానింగ్ నిర్వహించారు. ఈ రిపోర్టులో ఎటువంటి కండరాల చిరుగు ఉన్నట్లు ఆధారాలు లభించలేదు. ప్రాథమిక మెడికల్ రిపోర్ట్‌లో కండరాల సంబంధిత సమస్యలు ఏవీ లేవని తేలింది. అయితే, ఈ మెడికల్ రిపోర్ట్ ఇంకా అసంపూర్తిగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. హిట్‌మ్యాన్‌కు మరికొన్ని పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. పూర్తి హెల్త్ రిపోర్టు వచ్చిన తర్వాతే గాయంపై పూర్తి స్పష్టత వస్తుంది. ఒకవేళ ఇది తీవ్రమైన గాయం కాకపోతే, రాబోయే మ్యాచ్‌లకు రోహిత్ అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఏదేమైనా, బీసీసీఐ మెడికల్ టీమ్ ప్రస్తుతం రోహిత్ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. త్వరలోనే ఈ అంశంపై ముంబై ఇండియన్స్ లేదా బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మరోవైపు నిపుణుల అభిప్రాయం ప్రకారం.. హ్యామ్‌స్ట్రింగ్ గాయాలు సీరియస్‌గానే పరిగణించబడతాయట. అయితే.. రోహిత్ అయిన గాయాన్ని పరిశీలిస్తే మరీ ఎక్కువ మ్యాచులకు దూరం కావాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో అతడిని ఆడించి రిస్క్ తీసుకోవడం కంటే, విశ్రాంతినిచ్చి గాయం తీవ్రం కాకుండా చూడాలని మేనేజ్మెంట్ భావిస్తోందట. అయినప్పటికీ, తన అనుభవం దృష్ట్యా తుది నిర్ణయాన్ని మేనేజ్మెంట్ రోహిత్ కే వదిలేసింది. ఆడాలా? వద్దా? అనేది రోహిత్ చేతిలోనే ఉంది.

**ఇంతకీ రోహిత్ శర్మకి ఏమైంది?**

ఆదివారం(ఏప్రిల్ 13న) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్‌కి జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మకు గాయమైంది. 241 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా ఆరో ఓవర్లో 13 బంతుల్లో 19 పరుగులు చేశాడు రోహిత్. తర్వాత రోహిత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఇక ఆరో ఓవర్ ప్రారంభానికి ముందు రోహిత్ ఇబ్బందిపడుతూ కనిపించాడు. ఫిజియో వచ్చి ట్రీట్‌మెంట్ అందించాడు. ఆ ఓవర్‌లో రెండో బంతిని ఎదుర్కొన్న తర్వాత రోహిత్ రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. తర్వాత ఈ బ్యాటర్ తిరిగి బ్యాటింగ్‌కు రాలేదు. ఈ మ్యాచ్‌లో ముంబయి 18 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన రోహిత్ 137 రన్స్ చేశాడు. కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో 78 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

# గెలిచినా మేం ఇంకా మెరుగుపడాలి!

**ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) మరో విజయాన్ని అందుకుంది. మంగళవారం కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 32 పరుగుల తేడాతో గెలిచింది. హ్యాట్రిక్ ఓటముల అనంతరం వరుసగా రెండు మ్యాచుల్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో కాస్త పైకి వచ్చింది. ఈ విజయంపై సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఆనందం వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ.. పిచ్ పరిస్థితులు మారడం వల్ల తాము లక్ష్యాన్ని సరిగ్గా అంచనా వేసి బౌలింగ్‌లో ప్లాన్‌ను అమలు చేశామని చెప్పాడు. ఫీల్డింగ్‌కు సంబంధించి ఎలాంటి సాకులు చెప్పనని, ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని రుతురాజ్ స్పష్టం చేశాడు.సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ... 'నిజం చెప్పాలంటే ఈ విజయంతో చాలా సంతోషంగా ఉన్నాం. ఒక మంచి స్కోర్‌ను డిఫెండ్ చేయగలిగాం. పిచ్ పరిస్థితులను బట్టి చూస్తే అది మంచి స్కోర్ అనిపించింది. మొదటి 7-8 ఓవర్ల తర్వాత వికెట్ పూర్తిగా మారిపోయింది. స్పిన్ అవ్వడం మొదలైంది, బంతి ఆగిపోవడం కూడా ఆగిపోయింది. మొదట మేము 220 లేదా 210 స్కోర్ లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ తర్వాత 190-180 స్కోర్ కూడా సరిపోతుందని భావించాం. పవర్‌ప్లేలో బాగా బౌలింగ్ చేయాలనుకున్నాం. ఆ తర్వాత రన్‌రేట్‌ను కంట్రోల్‌లో ఉంచడమే లక్ష్యంగా ముందుకు సాగాం' అని చెప్పాడు.'మా బౌలింగ్ బాగుంది. మెల్లగా జట్టు సమన్వయం మెరుగుపడుతోంది. ప్రతి ఆటగాడికి తన పాత్ర స్పష్టంగా తెలిసింది. ఏ ఓవర్లు వేయాలి, ఏ లెంగ్త్‌లో బౌలింగ్ చేయాలన్నది తెలుసుకున్నారు. జట్టు అవసరాలకు అనుగుణంగా ఆటగాళ్లు అలవాటు పడుతున్నారు. జట్టు క్రమంగా**



**మెరుగుపడుతోంది. ఇది మంచి సూచన. బ్యాటింగ్‌లో అవసరం ఉంటే వీర్‌ను ఉపయోగించాలని అనుకున్నాం. బ్యాటింగ్ బాగా చేశాం కాబట్టి రెండో ఇన్నింగ్స్‌లో పవర్‌ప్లే బౌలర్‌గా అకీల్‌ను తీసుకొచ్చాం. మధ్యలో ఇద్దరు రైట్ హ్యాండర్లు ఉన్నా.. మంచి ఓవర్లు వేశాడు. నూర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఫీల్డింగ్‌లో చాలా క్యాచ్‌లు మిస్ అయ్యాయి. ఒకటి రెండు మాత్రమే పట్టుకున్నాం. ఈరోజు వాతావరణం కొంచెం తేమగా ఉంది, చేతులకు చెమట ఎక్కువగా వచ్చింది. ఇది సాకుగా చెప్పలేను. ఫీల్డింగ్‌లో బాగా మెరుగవ్వాల్సిన అవసరం ఉంది. నా ఫామ్ పైన ఎలాంటి ఆందోళన లేదు. ఫిట్‌నెస్, మానసికంగా బాగున్నా. ఒకే ఒక్క పెద్ద ఇన్నింగ్స్ ఆడితే అన్నీ కుదురుకుంటాయి. జట్టులోని ఇతర ఆటగాళ్లు బాగా ఆడుతున్నారు' అని రుతురాజ్ చెప్పుకొచ్చాడు.**

# బిజినెస్

## పొంచి ఉన్న ఉద్యోగాల సంక్షోభం

ప్రపంచం అతిపెద్ద ఉద్యోగాల సంక్షోభాన్ని ఎదుర్కోబోతోందని ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ బంగా హెచ్చరించారు. వచ్చే 10-15 సంవత్సరాల్లో వర్ధమాన దేశాల్లో 120 కోట్ల మందికి కొత్తగా ఉద్యోగాలు అవసరమైతే అందు లో 40 కోట్ల మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మిగతా 80 కోట్ల మంది సరైన ఉద్యోగాలు లేక రోడ్ల మీద తిరగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి స్వల్పకాలిక సంక్షోభాలు ముగిసినా ఈ నిరుద్యోగ సంక్షోభం తప్పదని బంగా హెచ్చరించారు.



**దీర్ఘకాలిక వ్యూహం అవసరం:** ఈ పరిస్థితిని అధిగమించాలంటే ప్రభుత్వాలు వెంటనే ఉద్యోగాల కల్పన, ప్రజలకు సురక్షిత మంచినీరు అందించడం, విద్యుదీకరణ వంటి దీర్ఘకాలిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని బంగా స్పష్టం చేశారు. ఈ నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు వెంటనే చర్యలు చేపట్టకపోతే అక్రమ వలసలు పెరిగిపోయి అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ అస్థిరతతో గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 11.7 కోట్ల మంది నిరాశ్రయులైన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రమాదాలను అధిగమించేందుకు వర్ధమాన దేశాల్లో సులభతర వాణిజ్య విధానాల ద్వారా పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రపంచ బ్యాంక్ ప్రయత్నిస్తున్నట్టు బంగా చెప్పారు.


## భారత వృద్ధిని పెంచిన ఐఎంఎఫ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాలను పెంచుతున్నట్టు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వెల్లడించింది. జనవరిలో ప్రకటించిన అంచనాల కంటే 10 బేసిస్ పాయింట్లు ఎక్కువగా 6.5 శాతం భరత్ వృద్ధి చెందగలదని ఐఎంఎఫ్ అభిప్రాయపడింది. ఇందుకు ప్రధానంగా అమెరికా మనదేశంపై విధించిన సుంకాలను 50 శాతం నుంచి 10 శాతానికి తగ్గించడమే కారణమని తెలిపింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలను భారత్ ధీటుగా ఎదుర్కోగలదని ఐఎంఎఫ్ పేర్కొంది. ఇదే సమయంలో దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.7 శాతంగా నమోదు కావొచ్చని ఐఎంఎఫ్ తెలిపింది. పశ్చిమాసియా సంక్షోభం అనుకున్న దానికంటే ఎక్కువ కాలం కొనసాగడం వల్లనే ద్రవ్యోల్బణం ప్రభావితం అవుతోంది. ఒకవేళ ఈ ఏడాది ముడి చమురు ధరలు బ్యారెల్‌కు సగటున 120 డాలర్లుగా ఉ




ంటే, భారత వృద్ధి 6.1-6.2 శాతానికి పరిమితం అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ, ప్రతికూల పరిస్థితులను అధిగమించి భారత్ ప్రపంచ వృద్ధి కంటే ఎక్కువగానే సాధిస్తుందని ఆర్థిక నిపుణులు వెల్లడించారు.

## వాహనానికి తిప్పలే..!



గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో బలమైన పనితీరును కనబరిచిన దేశీయ వాహన పరిశ్రమ.. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంతో ప్రతికూల పర్యవసానాలు ఎదుర్కొనే అవకాశం ఉందని భారత వాహన తయారీదారుల సమాఖ్య (సియామ్) అధ్యక్షుడు శైలేష్ చంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం ఇండస్ట్రీకి సవాలుగా పరిణమించనుందని, వాహన గిరాకీపై పరోక్ష ప్రభావం చూపవచ్చని ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అన్నారు. "సరఫరా అవరోధాల కారణంగా వాహనాల పెయింటింగ్, హీట్ ట్రీట్‌మెంట్ ప్రాసెస్‌లో ఉపయోగించే కీలక రసాయనాలైన ప్రోపేన్, ఎథిలీన్ కొరత ఏర్పడింది. అంతేకాదు, కొన్ని పెట్రోకెమికల్స్, ఇతర కీలక కమోడిటీల కొరత కూడా మొదలైంది. అంతర్జాతీయ సరుకు రవాణా పరిస్థితుల్లో అనిశ్చితి పెరిగింది. హోర్ముజ్ జలసంధి మూసివేతతో దారి మళ్లింపు, సరఫరా జాప్యం కారణంగా నౌకల ద్వారా సరుకు రవాణా వ్యయం పెరుగుతోంద"ని శైలేష్ చంద్ర అన్నారు. ప్రస్తుతం వాహన ఉత్పతికి ఎలాంటి అవాంతరాలు లేకపోయినప్పటికీ భవిష్యత్ అస్థిరంగా మారిందన్నారు. విడిభాగాల సరఫరా విషయానికొస్తే, ఇదివరకు ప్రతి మూడు రోజులకోసారి డెలివరీ జరిగేదని..ఇప్పుడు కాస్త జాప్యమవుతోందన్నారు. దాంతో కొంత ఒత్తిడి పెరిగిందని, ముమ్ముందు పరిస్థితులు ఎలా ఉంటాయో వేచి చూడాలన్నారు.

**వాహన ధరలు మరింత పెంపు?**

ప్రస్తుత సమస్యకు పరిష్కారం, ఏమేం చర్యలు చేపట్టవచ్చనే విషయాలపై వాహన పరిశ్రమ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందని శైలేష్ చంద్ర తెలిపారు. ఉత్పత్తి వ్యయం పెరిగినప్పటికీ తమ పరిశ్రమ వాహన సరఫరాను కొనసాగిస్తోందని.. అవాంతరాలున్న సందర్భాల్లో కొన్ని కంపెనీలు ఎయిర్‌కార్గో ద్వారా సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యుద్ధం మరింత కాలం కొనసాగితే, పరిస్థితులు అధ్వానంగా మారవచ్చని.. ఉత్పత్తి వ్యయం పరిమితికి మించి పెరిగితే, వాహన ధరలను మరింత పెంచాల్సి రావచ్చన్నారు. కమోడిటీ ధరలు ఏమేర పెరుగుతాయనే విషయంపై వచ్చే 4-5 వారాల్లో స్పష్టత రావచ్చన్నారు. అప్పుడు గానీ వాహన ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవడానికి వీలవుతుందన్నారు. ఇందుకు తోడు ఇంధన ధరలు కూడా పెరిగితే వాహన గిరాకీపై ప్రభావం చూపవచ్చన్నారు. ప్రస్తుతానికైతే కస్టమర్ల ఎంక్వైరీలు జోరుగానే ఉన్నప్పటికీ, వారి కొనుగోళ్లు మాత్రం కొంత జాప్యమవుతున్నట్లు డీలర్ల నుంచి సమాచారం అందుతోందన్నారు. ఇంధన ధరలు పెరిగితే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరగవచ్చని శైలేష్ చంద్ర అభిప్రాయపడ్డారు.

**2.83 కోట్ల యూనిట్ల టోకు విక్రయాలు**

మార్చి 31తో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో వాహనాల టోకు విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 10.4 శాతం పెరిగి 2.83 కోట్ల యూనిట్లకు చేరుకున్నాయని సియామ్ వెల్లడించింది. ప్యాసింజర్, కమర్షియల్, ద్విచక్ర, త్రిచక్ర వాహన విభాగాల అమ్మకాలు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి పెరిగాయని తెలిపింది. గత సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం వాహనాలపై జీఎస్టీని తగ్గించడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వాహన టోకు విక్రయాలు 2.56 కోట్ల యూనిట్లుగా నమోదయ్యాయి. కాగా, 2025-26లో భారత్ నుంచి మొత్తం వాహన ఎగుమతులు 24 శాతం వృద్ధితో 66,47,685 యూనిట్లకు పెరిగాయి. 2024-25లో ఎగుమతులు 53,62,884 యూనిట్లుగా నమోదయ్యాయి. మన ఆర్థిక మూలాలు బలంగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)పై సానుకూల దృక్పథంతోనే ఉన్నప్పటికీ, పశ్చిమాసియాలో యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే వాహనాల తయారీ, సరఫరా, గిరాకీపై గణనీయ ప్రభావం చూపవచ్చని సియామ్ పేర్కొంది.




## షాకిచ్చిన బంగారం, వెండి ధరలు..

బంగారం, వెండి ధరలు మళ్లీ ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. వరుసగా రెండో రోజు ఈ లోహాల ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ఉదయం 10 గంటలకు లైవ్ ట్రేడింగ్ లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1420 పెరిగి.. రూ.1,55,350కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1300 పెరిగి.. రూ.1,42,400 వద్ద కొనసాగుతోంది. ఇదే సమయంలో వెండి ధర కూడా భారీగానే పెరిగింది. కిలో వెండిపై ఏకంగా రూ.10,000 పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,75,000గా ఉంది. పెరిగిన ధరలపై జీఎస్టీ, తరుగు అదనంగా ఉండనున్నాయి. కాగా.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో స్వల్ప మార్పులుండొచ్చు. జూన్ వరకూ ఓ వైపు పెళ్లిళ్లు, మరోవైపు ఇతర శుభకార్యాలున్న వేళ..

బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునేవారికి పెరిగిన ధరలు భారమవుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి వారిలో బంగారం మళ్లీ అందని ద్రాక్షవుతుందా అన్న ఆందోళన మొదలైంది.

## స్టాక్ మార్కెట్‌లో లాభాల విందు..




అంతర్జాతీయ పరిణామాలు భారతీయ స్టాక్ మార్కెట్ కు సరికొత్త ఊపునిచ్చాయి. అమెరికా, ఇరాన్ దేశాలు యుద్ధం ముగింపు కోసం మరోసారి చర్చల వేదికపైకి రానున్నాయన్న వార్తలతో గ్లోబల్ మార్కెట్‌లలో పాజిటివ్ సెంటిమెంట్ పెరిగింది. దీంతో భారతీయ సూచీలు నేడు భారీ గ్యాప్-అప్ ఓపెనింగ్‌ను నమోదు చేశాయి. సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లోనే 1200 పాయింట్లకు పైగా లాభపడి 78,139 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 380 పాయింట్ల వృద్ధితో 24,235 స్థాయిని చేరుకుంది. బ్యాంకింగ్, ఐటీ, ఆటో, మెటల్, ఫార్మా వంటి అన్ని రంగాలు లాభాల్లో దూసుకెళ్తున్నాయి. ముఖ్యంగా రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు మార్కెట్‌ను ముందుకు నడిపిస్తున్నాయి.

**లాభాలకు ప్రధాన కారణాలు..**

అమెరికా-ఇరాన్ మధ్య చర్చల ప్రక్రియ మళ్లీ మొదలవుతుండటంతో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తగ్గుతాయని, తద్వారా చమురు సరఫరా మెరుగుపడుతుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. యుద్ధం ముగుస్తుందన్న సంకేతాలతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు మళ్ళీ రిస్క్ తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు. దేశీయంగా మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ కూడా రాజకీయ స్థిరత్వాన్ని సూచిస్తూ మార్కెట్‌కు అదనపు బలాన్ని ఇచ్చినట్లు విశ్లేషకులు బావిస్తున్నారు.

# డైరెక్ట్ ఓటీటీలోకి..





యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా తన కెరీర్‌లో ఒక గట్టి హిట్ కోసం ఎదురుచూస్తోంది. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆమెకు అదృష్టం అంతగా కలిసి రావడం లేదు. చివరగా హిందీలో 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రంతో హిట్ కొట్టి ఈ భామకు.. తెలుగులో భారీ అంచనాల మధ్య వచ్చిన తెలుసు కదా, ఉస్తాద్ భగత్ సింగ్ వంటి చిత్రాలు ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించలేకపోవడంతో, ఇప్పుడు ఆమె తన ఆశలన్నీ ఓటీటీపైనే పెట్టుకుంది. రాశీ ఖన్నా తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఒక విభిన్నమైన మ్యూజికల్ యాక్షన్ డ్రామాగా ఎంచుకుంది. 'లుఖ్కే' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ క్రేజీ సిరీస్‌లో పాపులర్ ర్యాపర్ కింగ్ హీరోగా పరిచయం అవుతున్నారు. హిమాంక్ గౌర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో పాలక్ తివారి, శివాంకిత్, లక్ష్య వీర్ శరణ్ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు.పంజాబ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథలో రాశీ ఖన్నా లుక్ పర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. పంజాబ్‌లోని ర్యాప్ మ్యూజిక్ కల్చర్, దాని వెనుక ఉన్న డ్రగ్ సిండికేట్, పగ - ప్రతీకారాల నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. సంగీత ప్రపంచంలోని చీకటి కోణాలను చూపిస్తూనే, పక్కా యాక్షన్ ఎలిమెంట్స్‌తో దీన్ని రూపొందించారట మేకర్స్. సినిమాల్లో ఆశించిన సక్సెస్ రాకపోయినా, ఈ డిజిటల్ సిరీస్ ద్వారా తన సత్తా చాటాలని రాశీ ఖన్నా గట్టి పట్టుదలతో ఉంది. ఇక ఈ భారీ వెబ్ సిరీస్ డైరెక్ట్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్‌లో మే 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కింగ్ మార్క్ మ్యూజిక్, రాశీ ఖన్నా గ్లామర్, యాక్షన్ కలగలిపిన ఈ సిరీస్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న రాశీ ఖన్నాకు 'లుఖ్కే' అయినా మంచి హిట్ ఇస్తుందని ఆమె అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# మైత్రి బ్యానర్‌లో మౌళి సినిమా..



యూట్యూబ్ వీడియోల ద్వారా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి, ఇప్పుడు టాలీవుడ్‌లో హీరోగా నిలదొక్కుకుంటున్నాడు మౌళి. ఇక ఆదిత్య హాసన్ దర్శకత్వంలో వచ్చిన '90ం ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌తో మౌళి తిరుగులేని పాపులారిటీని సంపాదించుకున్నారు. అందులో ఆయన పండించిన కామెడీ, నటన ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత 'లిటిల్ హార్ట్స్' అనే సినిమాతో హీరోగా పరిచయమై, బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నారు. చిన్న సినిమాగా వచ్చిన ఈ చిత్రం మౌళికి హీరోగా మంచి క్రేజ్‌ను తెచ్చిపెట్టింది. దీంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్ ఎవరితో చేస్తారనే ఆసక్తి నెలకొంది. ఈనేపథ్యంలోనే మౌళి తన తదుపరి చిత్రాన్ని టాలీవుడ్ టాప్ నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో చేయబోతున్నట్లు వార్తలు వైరల్ అయ్యాయి. యంగ్ హీరోకు ఇంత పెద్ద బ్యానర్‌లో అవకాశం రావడం విశేషమే. అయితే ఈ చిత్రానికి ఓ కొత్త దర్శకుడు దర్శకత్వం వహించబోతున్నారని ఫిల్మ్ నగర్ టాక్. గత కొద్ది రోజులుగా ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. అధికారిక ప్రకటన రానప్పటికీ ఈ వార్తలు నిజమే అని అంతా నమ్మేశారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకు 'దొంగ నా కొడుక' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ టైటిల్ వినడానికి చాలా వెరైటీగా, మాస్ స్టైల్‌లో ఉంది. గతంలో ఇలాంటి టైటిల్స్‌తో వచ్చిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలను అందుకున్నాయి. అదే సెంటిమెంట్ మౌళికి కూడా కలిసొచ్చి, ఈ సినిమాతో ఆయన మరో భారీ హిట్ కొడతారని అభిమానులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఈ టైటిల్‌కు సంబంధించిన పోస్టులు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం మౌళి కెరీర్‌ను మరో మెట్టు ఎక్కించడం ఖాయమనిపిస్తోంది.



# ధనుష్ 56 చిత్రంపై లేటెస్ట్ బజ్..

విభిన్న కథలతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో కూడా తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని ప్రస్తుతం స్టార్ హీరోగా దూసుకుపోతున్నాడు ధనుష్. ఆయన గ్యాప్ ఇవ్వకుండా బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు అనౌన్స్ చేస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తున్నాడు. అలాగే ప్రస్తుతం ఈ హీరో తన 56వ చిత్రంపై కూడా ఫోకస్ పెట్టినట్లు టాక్. తమిళ దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడని తెలుస్తుండగా.. ఇందులో ఫీ మేల్ లీడ్ కోసం రుక్మిణి వసంత్‌ను ఓకే చేసినట్లు టాక్ వచ్చిన విషయం తెలిసిందే.'కాంతార', 'ఏస్', 'మదరాసి' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ ప్రస్తుతం చేతులో వరుస ప్రాజెక్టులు పెట్టుకుని బిజీ అయిపోయింది. ఈ క్రమంలోనే ధనుష్ 56వ చిత్రానికి గాను డేట్ సమస్యల కారణంగా ఈ మూవీ నుంచి రుక్మిణిని తప్పించినట్లు టాక్. అలాగే ధనుష్ సరసన హీరోయిన్‌గా సారా అర్జున్‌ను లైన్‌లో పెట్టారట మేకర్స్. టాక్స్ ఫైనల్ అయితే.. దీనిపై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ అవకాశం ఉన్నట్లు కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం.



## రామ్ చరణ్ తో మరో సినిమా...

టాలీవుడ్ ఇండస్ట్రీలో రామ్ చరణ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మెగాస్టార్ చిరంజీవి వారసత్వాన్ని అందిపుచ్చుకొని ఇండస్ట్రీలోకి వచ్చిన రామ్ చరణ్, తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. RRR లాంటి సినిమా చేసి పాన్ ఇండియా స్టార్ హీరోగా మారిపోయారు. అయితే అలాంటి రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ సమ్మర్ కానుకగా రిలీజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**చరణ్ తో మరో సినిమాకు బుచ్చిబాబు స్కెచ్ !**

బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ పెద్ది సినిమా తెరకెక్కుతోంది. అయితే ఈ సినిమా పూర్తి కాకముందే రామ్ చరణ్ తో మరో సినిమా కావాలంటూ బుచ్చిబాబు చేసిన పోస్ట్ వైరల్ గా మారింది. తాజాగా రామ్ చరణ్ తో ఫోటో షూట్ కు సంబంధించిన వీడియోను ఎస్క్వైర్ ఇండియా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది. ఇక దీనిపై బుచ్చిబాబు స్పందించారు. సార్.. తనకు మరోసారి అవకాశం ఇవ్వండి అంటూ వెల్లడించారు. దీంతో రామ్ చరణ్ తో దర్శకుడు బుచ్చిబాబు మరో సినిమా చేసేందుకు ప్లాన్ చేసినట్లు టాక్ నడుస్తోంది. పెద్ది సినిమా పెద్ద హిట్ అవుతే వీరి కాంబినేషన్ లో మరో సినిమా రావడం గ్యారెంటీ అని మెగా అభిమానులు అంటున్నారు.

## శ్రీనివాస మంగాపురం టీజర్ అప్డేట్..




సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మూడో తరంగా ఇండస్ట్రీ ఎంట్రీకి సిద్ధం అయ్యాడు దివంగత రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని. 'శ్రీనివాస మంగాపురం' అనే క్రేజీ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి లేటెస్ట్‌గా సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఇందులో నుంచి టీజర్ రాబోతుందని తెలుపుతూ.. 'నిష్కల్మషత్వంలో పాతుకుపోయిన రెండు హృదయాలు.. తీవ్రతతో నిండిన ఒక గాథ.. శ్రీనివాస మంగాపురం టీజర్ రేపు సాయంత్రం 6 గంటలకు విడుదల కాబోతున్నది.. ఆ ప్రపంచం ఆవిష్కృతమవడాన్ని వీక్షించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ ఓ క్యూట్ పోస్టర్‌ను షేర్ చేశారు. ప్రజెంట్ ఈ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కాగా.. 'RX 100', 'మంగళవారం' వంటి సెన్సేషనల్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న కల్ట్ డైరెక్టర్ అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. చందమామ కథలు వంటి వైవిధ్యమైన చిత్రాలను నిర్మించిన బ్యానర్‌పై ప్రఖ్యాత నిర్మాత అశ్వనీదత్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ బ్యూటీ రవీనా టాండన్ కూతురు రాషా తడాని టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.




## 'కట్టలాన్' ట్రైలర్ రిలీజ్‌కు తేదీ ఖరారు..

మలయాళ నటుడు ఆంటోనీ వర్గీస్, దర్శకుడు పాల్ జార్జ్ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ 'కట్టలాన్'. ఈ చిత్రాన్ని క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సుమారు రూ. 45 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో ఆంటోనీ వర్గీస్ సరసన దుషారా విజయన్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే టాలీవుడ్ నటుడు సునీల్, సీనియర్ యాక్టర్ జగదీష్, కబీర్ దుహాన్ సింగ్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇంతమంది స్టార్స్ ఉండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం మే 14న పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కాబోతుంది. దీంతో ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ తాజాగా ఒక వైల్డ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆంటోనీ వర్గీస్ చేయి మొత్తం రక్తంతో తడిసి ఉండటం, పక్కనే ఉన్న ఒక ఏనుగు బొమ్మపై పెట్టగా.. దానిపై నుంచి రక్తం కారుతూ ఉండటం చూస్తుంటే సినిమా ఎంత వయెలెంట్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. ఈ క్రేజీ మూవీ ట్రైలర్‌ను ఏప్రిల్ 15న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అడవి నేపథ్యంలో సాగే ఈ రివెంజ్ డ్రామాలో ఆంటోనీ వర్గీస్ మరోసారి తన మాస్ నటనతో మెప్పించడానికి సిద్ధమయ్యారు. ముఖ్యంగా సునీల్ పాత్ర ఈ సినిమాలో ఎలా ఉండబోతోందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రేపు రాబోయే ట్రైలర్‌తో సినిమా కథపై మరింత స్పష్టత రానుంది.




# 'టాక్సిక్' జూన్ రిలీజ్ వాయిదా!

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' . అయితే గత కొద్దిరోజులుగా ఈ సినిమా విడుదల వాయిదా పడిందంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మొదట మార్చి 19న విడుదల కావాల్సిన ఈ చిత్రం, కొన్ని కారణాల వల్ల జూన్ 4వ తేదీకి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు జూన్ లో కూడా రావడం లేదంటూ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ ప్రచారాన్ని చిత్ర యూనిట్ తీవ్రంగా ఖండించింది. జూన్ 4న సినిమా రావడం లేదంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని 'టాక్సిక్' టీం స్పష్టం చేస్తూ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, చెప్పిన డేట్ కు సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. కేవలం పుకార్లను నమ్మి అభిమానులు ఆందోళన చెందవద్దని వారు కోరారు. మరోవైపు యశ్ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే పనిలో ఉన్నారు. అమెరికాలో ప్రతిష్టాత్మకంగా జరిగే 'సినిమాకాన్' ఈవెంట్‌కు యశ్ హాజరయ్యాడు. అక్కడ 'టాక్సిక్' చిత్రంతో పాటు ఆయన నటిస్తున్న మరో భారీ ప్రాజెక్ట్ 'రామాయణ' కి సంబంధించిన వరల్డ్ వైడ్ ప్రమోషన్స్‌లో పాల్గొన్నారు. నితీష్ తివారీ దర్శకత్వంలో వస్తున్న 'రామాయణ'లో యశ్ రావణాసురుడి పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఒకవైపు 'టాక్సిక్' షూటింగ్, మరోవైపు 'రామాయణ' ప్రమోషన్లతో యశ్ బిజీ బిజీగా గడుపుతున్నారు. రావణాసురుడిగా యశ్ లుక్ ఎలా ఉండబోతుందో అని అటు బాలీవుడ్, ఇటు సౌత్ సినీ ప్రియులు ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రమోషన్ల విషయంలో యశ్ తీసుకుంటున్న జాగ్రత్తలు చూస్తుంటే ఈ రెండు సినిమాలు గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఇందులో నా విశ్వరూపం చూస్తారు




కన్నడ ముద్దుగుమ్మ కయ్యదు లోహర్ ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. గత ఏడాది విడుదలైన 'డ్రాగన్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ భామ, ఇప్పుడు వరుసగా భారీ ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. కేవలం కన్నడలోనే కాకుండా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లోనూ క్రేజీ అవకాశాలను దక్కించుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. ప్రస్తుతం మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ సరసన 'ఐయామ్ గేమ్' అనే పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్‌లో కయ్యదు హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను దుల్కర్ తన సొంత నిర్మాణ సంస్థ వేఫరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తుండటం విశేషం. 'ఆర్డీఎక్స్' వంటి భారీ హిట్‌ను అందించిన నహస్ హిదాయత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జూదం నేపథ్యంతో సాగే ఒక ఉత్సాహభరితమైన కథతో రూపొందుతోంది.ఇదిలా ఉంటే.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కయ్యదు లోహర్ తన పాత్ర గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. "ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా, భిన్నంగా ఉంటుంది. గతంలో నేను చేసిన 'పల్లిచట్టంబి' చిత్రానికి ఇది పూర్తి భిన్నమైనది. అందుకే ఈ సినిమా కోసం నేను చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. ప్రేక్షకులు నన్ను రెండు వేర్వేరు రూపాల్లో, విభిన్న కోణాల్లో చూస్తారు. ముఖ్యంగా ఈ సినిమాలో నా విశ్వరూపం చూపించబోతున్నారు డైరెక్టర్" అంటూ గట్టి నమ్మకాన్ని వ్యక్తం చేసింది. కేవలం దుల్కర్ మూవీనే కాకుండా, కయ్యదు ఖాతాలో మరికొన్ని భారీ సినిమాలు కూడా ఉన్నాయి. కాగా.. "ఐయామ్ గేమ్' చిత్రంలో కతీర్, సంయుక్త విశ్వనాథన్, మిస్కిన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు జేక్స్ బెజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో నిండిన ఈ చిత్రం 2026 ఓనం పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.




## ఆకట్టుకుంటున్న 'అగాధ' పోస్టర్..

తెలుగు సినీ పరిశ్రమలో ఎన్నో ట్రెండ్ సెట్టింగ్ బ్లాక్ బస్టర్స్ అందించిన మేకర్ ఎం.ఎస్. రాజు, గత కొంతకాలంగా విభిన్నమైన కథాంశాలతో సినిమాలు తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఆయన దర్శకత్వం వహిస్తున్న 'అగాధ' అనే చిత్రం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దీన్ని ఒక 'మిస్టికల్ డివైన్ థ్రిల్లర్' గా అభివర్ణిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.ఈ సినిమా టెక్నికల్ పరంగా చాలా గ్రాండ్ గా ఉండబోతోంది. మొత్తం 85 రోజుల పాటు వివిధ రకాల సెట్స్, లొకేషన్లలో ఈ చిత్రాన్ని చిత్రీకరించారు. మరీ ముఖ్యంగా, సినిమాలో సుమారు 45 నిమిషాల పాటు వీఎఫ్ఎక్స్ సన్నివేశాలు ఉండటం విశేషం.ఇక మిస్టరీ, దైవత్వం కలగలిసిన కథ కావడంతో విజువల్స్ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఎం.ఎస్. రాజు ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. అయితే తాజాగా విడుదలైన అనౌన్స్ మెంట్ వీడియో పోస్టర్ చూస్తుంటే, ఒక అమ్మాయి 12 చేతులున్న భారీ విగ్రహం ముందు నిలబడి ఉండటం సినిమాలో ఏదో తెలియని రహస్యం ఉందని పిస్తోంది. కాశీ విశాలాక్షి బాలుసు 'శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్' బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మిక్కిన్ అరుల్ దేవ్ సంగీతం అందిస్తుండగా, ఈ సినిమాలో నటించిన నటీనటుల వివరాలను మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ లో ఉంచారు. త్వరలోనే వారి వివరాలను వెల్లడించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229